



RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్): & చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:- 9705770909 సంప్రదించండి.

సంచిక : 241 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | శుక్రవారం | 19-12-2025 పేజీలు-8 | వెల: రూ. 5.00



## 10 నెలల్లో 8 యుద్ధాలు ఆపా..

- టారిఫ్ అనే పదం నాకు చాలా ఇష్టం
- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి చాటింపు

**న్యూఢిల్లీ,**
తాను ఎనిమిది యుద్ధాలు ఆపానంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి చాటింపు వేసుకున్నారు. ఇందుకు టారిఫ్‌లే కారణమని పేర్కొన్నారు. ఆంగ్లభాషలో 'టారిఫ్' అనే పదం తనకు చాలా ఇష్టమైన పదం అని ట్రంప్ పునరుద్ఘాటించారు.'పది నెలల్లో ఎనిమిది యుద్ధాలను ఆపాను . ఇరాన్ అణు ముప్పును నాశనం చేశాను. గాజాలో యుద్ధాన్ని ఆపి.. మూడు వేల సంవత్సరాల్లో

-మిగతా 2 లో





### మేం అందిస్తున్న సంక్షేమ పథకాలే


# మా విజయానికి కారణం

### పంచాయితీ ఫలితాలు మా పాలనకు గీటురాయి

- రెండేళ్ల మా పాలన పట్ల ప్రజల్లో సానుకూలత
- కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో సైతం ఆదరించారు
- వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఇవే ఫలితాలు రిపీట్ అవుతాయి
- బీఆర్ఎస్, బిజెపి కూటమికి 3-శాతం కూడా సీట్లు దక్కలేదు
- ఇప్పటికైనా బీఆర్ఎస్ బుద్ధిగా మసలుకోవాలి
- మీడియా సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, డిసెంబర్ 18(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మూడు దశల్లో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ అద్భుతమైన ఫలితాలను సాధించిందని.. 2029 అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇవే ఫలితాలు పునరావృత మవుతాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. మా రెండేళ్ల పాలనకు ప్రజలు ఇచ్చిన తీర్పు ఈ ఫలితాలని ఆయన అభివర్ణించారు. కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో సైతం కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆశీర్వదించారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. పార్టీ విజయం కోసం కష్టపడిన కాంగ్రెస్ కార్యకర్తలందరి కీ ధన్యవాదాలు తెలిపారు. జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు సీతక్క, ఉత్తమ్ కుమార్ రెడ్డిచ దామోదర్ రాజనర్సింహలతో కలిసి

-మిగతా 2 లో



## ప్రధాని మోడీకి మరో గౌరవం

### ఆర్డర్ ఆఫ్ ఒమన్' పురస్కారం ప్రదానం

- ఆర్డర్ ఆఫ్ ఒమన్' అనేది ఒమన్, విదేశీయులకు ఇచ్చే అత్యంత విశిష్టమైన పౌర పురస్కారం
- ప్రధాని మోదీ ఇప్పటివరకు వివిధ దేశాల నుంచి 29 అత్యున్నత పౌర పురస్కారాలు

**న్యూఢిల్లీ,**
భారత ప్రధాని నరేంద్ర మోదీకి అంతర్జాతీయ స్థాయిలో మరో అరుదైన గౌరవం దక్కింది. బుధవారం ఇథియోపియా అత్యున్నత పురస్కారాన్ని అందుకున్న ప్రధాని మోదీ.. మరుసటి రోజే మరో అరుదైన ఘనతను దక్కించుకున్నారు. ఒమన్ దేశం కూడా తన అత్యున్నత పౌర పురస్కారంతో ప్రధాని మోదీని గౌరవించడం విశేషం. ప్రధాని మోదీ తన మూడు దేశాల పర్యటనలో భాగంగా చివరిగా ఒమన్‌లో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా ఇరు దేశాల మధ్య పలు ఒప్పందాలు ఖరారయ్యాయి. భారత్, ఒమన్ దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం

-మిగతా 2 లో

## స్థానిక ఎన్నికల్లో బలపడ్డాం

### బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావు



**యాదాద్రిభువనగిరి,**
స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన బీజేపీ సర్పంచ్, ఉపసర్పంచ్‌లకు జరిగిన సన్మాన కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు పాల్గొన్నారు. దీనిలోభాగంగా ఆయన మాట్లాడుతూ.. ' యాదాద్రి భువనగిరి జిల్లాలో 4 సర్పంచులు 20 మంది ఉపసర్పంచ్లు 1000 వార్డులు గెలిచాం. రాష్ట్రంలో 900 సర్పంచులు 1200 ఉపసర్పంచ్లు 10,000 మంది వార్డులను గెలిచాం. గతంలో 162 సర్పంచ్ స్థానాలను ఉండేది. గ్రామీణ ప్రాంతాలలో

-మిగతా 2 లో

### వీబీ జీ రామ్ జీ' బిల్లుకు

# లోక్‌సభ ఆమోదం

### లోక్‌సభలో పత్రలు చించి నిరసన తెలిపిన విపక్షం

- వెల్‌లోకి దూసుకెళ్లి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన
- మహాత్ముడి పేరు మార్పు దుర్మార్గమని విమర్శలు
- గాంధీ ఆశయాలను ముందుకు తీసుకువెళుతున్నమన్న శివరాజ్‌సింగ్

**న్యూఢిల్లీ, డిసెంబర్ 18(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానంలో 'వీబీ జీ రామ్ జీ' పేరుతో తీసుకువచ్చిన బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. ప్రతిపక్ష ఎంపీల ఆందోళనలు, నిరసనల మధ్య ఈ బిల్లును ఆమోదించారు. అయితే, బిల్లును స్టాండింగ్ కమిటీకి పంపించాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష సభ్యులు వెల్‌లోకి దూసుకొచ్చి నిరసన వ్యక్తం చేశారు. విపక్ష సభ్యుల నిరసనలపై స్పందించిన స్పీకర్.. ఓం బిర్లా బిల్లుపై సుదీర్ఘంగా చర్చించారని చెప్పారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం' ఎంజీనరేగాను

-మిగతా 2 లో



## రైల్వే ప్రయాణీకులకు గుడ్‌న్యూస్..

- ఇకపై స్టేషన్లలో ఫ్రీ వై-ఫై సేవలు..!



**న్యూఢిల్లీ,**
రైల్వే ప్రయాణీకులకు గుడ్‌న్యూస్. డిజిటల్ సేవలను ప్రోత్సహించడంలో భాగంగా.. దేశవ్యాప్తంగా 6,117 రైల్వే స్టేషన్లలో ఉచిత వై-ఫైని రైల్వేశాఖ అందుబాటులోకి తీసుకువచ్చింది. రైల్వే మంత్రిత్వశాఖ ఈ ఫెసిలిటీ కోసం అదనంగా బడ్జెట్‌ను ఆమోదించలేదు. ప్రస్తుతం ఉన్న వనరులను ఉపయోగించుకొని సేవలను ప్రారంభించారు. లోక్‌సభలో ఓ ప్రశ్నకు సమాధానంగా.. ప్రయాణీకులకు మెరుగైన సౌలభ్యం. సురక్షితమైన ప్రయాణ అనుభవాన్ని అందించేందుకు డిజిటల్, భద్రతా మౌలిక సదుపాయాలు రెండింటినీ నిరంతరం బలోపేతం చేస్తున్నామని రైల్వేమంత్రిత్వశాఖ స్పష్టం చేసింది.ఇప్పటికే ఉన్న వనరులను ఉపయోగించి, పార్టనర్‌షిప్

-మిగతా 2 లో




### శాంతిభద్రతల విషయంలో

# రాజీలేదు

- పోలీసింగ్ అంటే భయం ఉండాల్సిందే
- క్రైమ్ రేట్ ఎక్కువగా ఉన్న జిల్లాలను సమీక్షించాలి
- రెండోరోజు కలెక్టర్ల సదస్సులో శాంతిభద్రతలపై చంద్రబాబు

**అమరావతి, -డిసెంబర్ 18(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రాష్ట్రంలో శాంతిభద్రతలే ప్రభుత్వానికి ముఖ్యమని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఇందుకోసం అధికారులు కఠినంగా ఉండాల్సిందేనని అన్నారు. పోలీసింగ్ అంటే భయం ఉండాలని స్పష్టం చేశారు. గురువారం జిల్లా కలెక్టర్ల సదస్సులో రెండోరోజు శాంతిభద్రతలపై జిల్లా ఎస్పీలు, కలెక్టర్లకు ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ..

-మిగతా 2 లో



## సీగల్‌కు చైనా జీపీఎస్ ట్రాకర్..

### నేవీ బేస్ సమీపంలో కనిపించడంతో కలకలం

**బెంగళూరు:-**
వలస పక్షి సీగల్‌కు చైనా జీపీఎస్ ట్రాకర్ ఉన్నది. భారత నౌకాదళం బేస్ సమీపంలో ఇది కనిపించింది. ఈ నేపథ్యంలో ఈ సంఘటన కలకలం రేపింది. సీగల్‌కు ఉన్న చైనా జీపీఎస్ ట్రాకర్ గురించి అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. కర్ణాటకలోని ఉత్తర కన్నడ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. కార్వార్ తీరంలో ఐఎన్ఎస్ కదంబ నావికా స్థావరం ఉన్నది. ఈ నేవల్ బేస్ సమీపంలోని తిమ్మక్క గార్డెన్ సమీపంలో సీగల్ పక్షి కనిపించింది. దానికి చైనా జీపీఎస్ ట్రాకర్ ఉండటాన్ని స్థానికులు గమనించారు. అటవీ శాఖలోని మెరైన్ డివిజన్‌కు సమాచారం ఇచ్చారు.కాగా, ఆ విభాగం అధికారులు అక్కడకు చేరుకున్నారు. చైనా జీపీఎస్ ట్రాకర్‌తో ఉన్న సీగల్‌ను స్వాధీనం చేసుకున్నారు. చైనాకు చెందిన రీసెర్చ్ సెంటర్ ఫర్ ఎకో ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్‌కు చెందిన ట్రాకర్‌గా గుర్తించారు. మరోవైపు ఆ ట్రాకర్ డేటాను అధికారులు పరిశీలించారు. కర్ణాటక తీరానికి చేరే ముందు ఆర్కిటిక్ ప్రాంతాలతో సహా 10,000 కిలోమీటర్లకు పైగా ఆ సీగల్ ప్రయాణించినట్లు తెలుసుకున్నారు. అయితే వలస పక్షులపై స్టడీ కోసమా లేక గూఢచర్యం కోసమా అన్నది తెలుసుకునేందుకు చైనా జీపీఎస్ ట్రాకర్‌ను సాంకేతిక పరీక్ష కోసం పంపారు.

### జిల్లా పరిషత్ ఎన్నికలకు

# సిద్ధం కండి

### భువనగిరి కోటపై గులాబీ జెండా ఎగరాలి



- సర్పంచ్ ఎన్నిక లఫలితాలతో వెయ్యి ఏనుగుల బలం
- ఇదే స్ఫూర్తితో ముందుకు సాగితే మనదే విజయం
- యాదాద్రి జిల్లాలో గెలిచిన సర్పంచ్‌ల అభినందనలో కేటీఆర్

**యాదాద్రి భువనగరి,- డిసెంబర్ 18(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జిల్లా పరిషత్ ఎన్నికలకు సిద్ధం కావాలని బీఆర్ఎస్ పార్టీ శ్రేణులకు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పార్టీకి పూర్వ వైభవం ప్రారంభమైందని, భవిష్యత్తులో సాధించబోయే అఖండ విజయాలకు యాదాద్రి భువనగిరి జిల్లా గడ్డ పునాది వేసిందని కేటీఆర్ స్పష్టం చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులతో

-మిగతా 2 లో

# మేం అందిస్తున్న సంక్షేమ పథకాలే మా విజయానికి కారణం

మొదటి తరువాయి

సీఎం మాట్లాడారు. మూడు విడతల్లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అద్భుత ఫలితాలు సాధించిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించిన ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ గెలుపునకు కష్టపడిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు శుభాకాంక్షలు చెప్పారు. ఈ పంచాయతీ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించిన అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు తెలియజేశారు. 12,702 పంచాయతీలకు గాను 7,527 పంచాయతీల్లో కాంగ్రెస్ పార్టీ గెలిచిందన్నారు. 808 కాంగ్రెస్ రెబల్స్ నెగ్గారని వివరించారు. 66 శాతం ఫలితాలను కాంగ్రెస్ సాధించిందని తెలిపారు. 3,511 కాంగ్రెస్ , 710 బీజేపీ మొత్తంగా 33 శాతం గెలిచాయని పేర్కొన్నారు. 94 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఎన్నికలు జరిగాయని.. 87 నియోజక వర్గాల పరిధిలో కాంగ్రెస్ మెజారిటీ సాధించిందని స్పష్టం చేశారు. పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయన్నారు. తమ ప్రభుత్వంపై ప్రజలు సంపూర్ణ విశ్వాసం కనబరిచారని ధీమా వ్యక్తం చేశారు. స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ కూటమిగా పోటీ చేశాయని ఆరోపించారు. బిఆర్ఎస్, బీజేపీ కూటమికి 33శాతం విజయాలు మాత్రమే దక్కాయన్నారు. బీఆర్ఎస్‌కు



3,511 సర్పంచ్ స్థానాలు, బీజేపీ 710 చోట్ల గెలిచాయని చెప్పారు. బీఆర్ఎస్, బీజేపీ కూటమికి 4,221 స్థానాలు మాత్రమే దక్కాయని సీఎం రేవంత్ తెలిపారు. ఇటీవల ప్రజాపాలన రెండేళ్ల సంబురాలు నిర్వహించుకున్నామని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలోని 12వేలకు పైగా గ్రామపంచాయతీల్లో ఎన్నికలు ప్రశాంతంగా, ప్రజాస్వామ్య బద్ధంగా జరిగాయి. ఎన్నికలు సజావుగా నిర్వహించిన అధికారులకు అభినందనలు తెలిపారు. దాదాపు 146 గ్రామ పంచాయతీలు (ఒక శాతం) సీపీఐ, సీపీఎం, ఇతరులు గెల్చుకున్నారు. ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లయిన తర్వాత జరిగిన ఎన్నికల్లోనూ ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరించారు. పంచాయతీ ఎన్నికల ఫలితాలు మా రెండేళ్ల పాలనపై తీర్పుగా భావిస్తున్నాం అని సిఎం అన్నారు. ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలనే పెద్దల సూచనను పాటిస్తాం. కానీ, ప్రతిపక్షంలో ఉన్న వారికి ఇంకా అహంకారం తగ్గలేదు. ఇప్పటికైనా ప్రజా తీర్పును గౌరవించి.. ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలకు సహకరించాలని రేవంత్ రెడ్డి అన్నారు. పేదలకు మేం అందిస్తున్న సంక్షేమ పథకాలే మా విజయానికి కారణం. ఈ ఫలితాలను చూసి భారత రాష్ట్ర సమితి నేతలు అద్భుతం అంటున్నారు. సంతోషం.. మీరు కోరుకున్నట్టే ఈ అద్భుతం 2029లో కూడా జరుగుతుంది. 2/3 మెజార్టీతో 2029లో కాంగ్రెస్ తిరిగి అధికారంలోకి వస్తుంది. 1/3తో భారత రాష్ట్ర సమితి ఉంటే.. 2/3 మెజార్టీతో కాంగ్రెస్ ఉంటుంది. ఈ తీర్పు 2029లో కూడా పునరావృతం కాబోతోందని సీఎం అన్నారు.

# వీబీ జీ రామ్ జీ' బిల్లుకు లోక్‌సభ ఆమోదం

మొదటి తరువాయి

రద్దు చేసి దాని స్థానంలో కొత్త చట్టం తీసుకొచ్చేందుకు ఉద్దేశించిన 'వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్-(గ్రామీణ్' (వీబీ జీ రామ్ జీ) బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. ఈ బిల్లుపై చర్చ సందర్భంగా విపక్షాలు పెద్దఎత్తున నిరసన వ్యక్తంచేశాయి. వారి ఆందోళన నడుమ స్పీకర్ ఓటింగ్ నిర్వహించగా.. బిల్లు కు ఆమోదం లభించింది. ఈ సమయంలో విపక్ష ఎంపీలు వెల్‌లోకి వచ్చి నిరసన చేపట్టాయి. కొందరు ప్రతిపక్ష నేతలు 'వీబీ జీ రామ్ జీ' బిల్లు ప్రతులను చించి విసిరేశారు. ఈ గందరగోళం నేపథ్యంలో లోక్‌సభ శుక్రవారానికి వాయిదా పడింది.అంతకుముందు బిల్లు తీరుపట్ల మరింత ఆగ్రహానికి గురైన విపక్ష సభ్యులు.. బిల్లు ప్రతులను చించి పడేశారు. వీరి ఆందోళనల మధ్యే బిల్లు ఆమోదం పొందినట్లు స్పీకర్ ప్రకటించారు. ఇక లోక్‌సభలో బిల్లు ఆమోదం పొందిన నేపథ్యంలో.. ఈ బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టనున్నారు. కాంగ్రెస్ పార్టీ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా, డీఎంకే నాయకులు టీఆర్ బాలు, సమాజ్‌వాదీ పార్టీ నాయకులు ధర్మేంద్ర యాదవ్ సహా పలువురు విపక్ష పార్టీల సభ్యులు.. జీ రామ్‌జీ బిల్లును తీవ్రంగా వ్యతిరేకించారు. బిల్లుకు వ్యతిరేకంగా సభలో ఆందోళన చేపట్టారు. ఈ పథకానికి మహాత్మాగాంధీ పేరును తొలగించడం అంటే జాతిపితను అవమానించడమేనని, కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ బిల్లుతో రాష్ట్రాలపై మరింత భారం పడుతుందని ఆరోపించారు. మరోవైపు జీ రామ్‌జీ బిల్లును కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ సమర్థించారు. బిల్లుపై లోక్‌సభలో మాట్లాడిన శివరాజ్ సింగ్.. కాంగ్రెస్ ప్రభుత్వం అనేక పథకాలకు నెహ్రూ పేరును పెట్టిందని గుర్తుచేశారు. ఇప్పుడు ఎన్డీయే ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తోందని విమర్శించారు. ప్రభుత్వానికి పేర్లు మార్చాలనే దురుద్దేశం ఉందంటూ ప్రియాంక గాంధీ చేసిన వ్యాఖ్యలను సైతం ఆయన ఖండించారు. పేర్లు మార్చాలనే ఉద్దేశం కేవలం ప్రతిపక్ష పార్టీలకు మాత్రమే ఉందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని తమ ప్రభుత్వం కేవలం పనిపై మాత్రమే దృష్టి పెడుతోందని చెప్పుకొచ్చారు. అందరితో చర్చించిన తర్వాతే కొత్త చట్టాన్ని తీసుకువచ్చామని కేంద్రమంత్రి ఉద్ఘాటించారు. కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కామెంట్స్‌పై ప్రతిపక్ష సభ్యులు మరింత ఆగ్రహం వ్యక్తం చేశారు. పలువురు ఎంపీలు సభ వెల్‌లోకి ప్రవేశించి.. బిల్లుకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. బిల్లు ప్రతులను చించేశారు. ఈ సందర్భంగా స్పీకర్ ఓం ప్రకాశ్ బిర్లా మాట్లాడుతూ.. 'కాగితాలను చించివేయడానికి ప్రజలు మిమ్మల్ని ఇక్కడికి పంపలేదు. దేశం మిమ్మల్ని చూస్తోంది.' అని విపక్ష సభ్యులను హెచ్చరించారు.

# జిల్లా పరిషత్ ఎన్నికలకు సిద్ధం కండి

మొదటి తరువాయి

ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ కార్యకర్తల్లో నూతనోత్సాహాన్ని నింపారు. తులం బంగారం ఇస్తామని, పింఛన్లు పెంచుతామని లంగ మాటలు చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, ఇప్పుడు రైతుబంధు రాక రైతులు అల్లాడుతున్నారని పేర్కొన్నారు. తినే ప్లేటులో మన్ను పోసుకున్నామని, పాలిచ్చే బర్రెను వదిలి తన్నే దున్నపోతును తెచ్చుకున్నామని ప్రజలు బాధపడుతున్నారని వ్యాఖ్యానించారు. వచ్చే జిల్లా పరిషత్ ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలని, భువనగిరి కోటపై గులాబీ జెండా ఎగరాలని పిలుపునిచ్చారు. పెద్దలు చెప్పినట్లు ఎక్కడైతే అధికారం పోగొట్టుకున్నామో, అక్కడే వెతుక్కోవాలని, ఈరోజు సర్పంచ్ ఎన్నికల ఫలితాలు ఆ ఉత్సాహాన్ని ఇస్తున్నాయని కేటీఆర్ పేర్కొన్నారు. రెండేళ్ల కిందట అసెంబ్లీ ఎన్నికల్లో కొద్దిపాటి ఓట్ల తేడాతో నిరాశ ఎదురైనా, నేడు భువనగిరిలో 56 మంది, ఆలేరులో 74 మంది, మునుగోడులో 15 మంది, తుంగతుర్తిలో 9 మంది, నకిరేకల్‌లో 7 మంది.. ఇలా జిల్లావ్యాప్తంగా మొత్తం 161 మంది సర్పంచులను గెలిపించుకోవడం సామాన్య విషయం కాదని ఆయన కొనియాడారు. ఈ విజయం రాష్ట్రవ్యాప్తంగా పార్టీ శ్రేణులకు వెయ్యి ఏనుగుల బలాన్ని ఇచ్చిందని, లక్ష్మీ నరసింహస్వామి ఆశీస్సులతో గులాబీ జెండా మళ్లీ రెపరెపలాడుతుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాజకీయం అత్యంత గలీజుగా మారిందని కేటీఆర్ మండిపడ్డారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో బీఆర్ఎస్ కార్యకర్తలపై జరుగుతున్న దాడులను ఆయన తీవ్రంగా ఖండించారు. నూతన్‌కల్ మండలంలో మల్లయ్య యాదవ్‌ను కిరాతకంగా చంపడం, నల్గొండలో అభ్యర్థిపై దాడి చేసి అమానవీయంగా మూత్రం తాగించి అవమానించడం వంటి ఘటనలు కాంగ్రెస్ నాయకుల వికృత మనస్తత్వానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. పదేళ్ల పాలనలో కేసీఆర్ ఎప్పుడూ ఇలాంటి చిల్లర రాజకీయాలకు తావివ్వలేదని గుర్తు చేశారు. అధికారులు కూడా అధికార పక్షానికి కొమ్ముకాస్తూ, గెలిచిన బీఆర్ఎస్ అభ్యర్థులను దొంగతనంగా ఓడించే ప్రయత్నం చేస్తున్నారని, 150కిపైగా గ్రామాల్లో జరుగుతున్న ఈ అన్యాయంపై కోర్టుల ద్వారా న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు. పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేలపై కేటీఆర్ నిప్పులు చెరిగారు. అభివృద్ధి కోసమే కాంగ్రెస్‌లోకి వెళ్లామని సిగ్గు లేకుండా మైకుల్లో చెబుతున్న కడియం శ్రీహరి వంటి నాయకులు, అసెంబ్లీలో ఏ పార్టీలో ఉన్నారో చెప్పుకోలేని హీనస్థితిలో ఉన్నారని ఎద్దేవా చేశారు. 70 ఏళ్ల వయసులో సంపాదించుకున్న గౌరవాన్ని రేవంత్ రెడ్డి సంకలో చేరి నాశనం చేసుకున్నారని, గబ్బిలాలు సూరు పట్టుకుని వేలాడినట్లు వీరి పరిస్థితి తయారైందని ఘాటుగా విమర్శించారు. స్పీకర్ కూడా ముఖ్యమంత్రి చెప్పినట్లు ఆడుతూ, ఫిరాయింపులు కనపడనట్లు నటిస్తున్నారని దుయ్యబట్టారు. రేవంత్ రెడ్డి మూడు ఫీట్లు ఉన్నా ముప్పై ఫీట్ల డైలాగులు కొడతారని, కానీ క్షేత్రస్థాయిలో ప్రజలు మోసపోయామని గ్రహిస్తున్నారని కేటీఆర్ అన్నారు. సర్పంచులు, ఎంపీటీసీలు సమన్వయంతో పనిచేయాలని, పార్టీ బీ-ఫామ్ మీద జరిగే ఈ ఎన్నికల్లో కారు గుర్తుకు తిరుగులేని విజయం అందించాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు ఎవరి అత్త సొమ్ము కాదని, అవి రాజ్యాంగబద్ధంగా ప్రజలకు అందాల్సిన హక్కులని, ఏ ఎమ్మెల్యే వాటిని ఆపలేదని భరోసా ఇచ్చారు.

# శాంతిభద్రతల విషయంలో రాజీలేదు

మొదటి తరువాయి

కొన్ని జిల్లాల్లో క్రైమ్ రేటు ఎక్కువగా ఉందని.. మరికొన్ని చోట్ల తక్కువగా ఉందన్నారు. కడప, అల్లూరి, ఏలూరు జిల్లాల్లో ప్రాపర్టీ సంబంధిత కేసులు ఎక్కువగా ఉండటానికి కారణం ఏమిటో విశ్లేషించాలని ఉన్నతాధికారులకు ఆయన సూచించారు. రాష్ట్రంలో 5.5 శాతం మేర నేరాల రేటు తగ్గిందని.. కానీ జిల్లాల మధ్య వ్యత్యాసం చాలా ఎక్కువగా ఉందని పేర్కొన్నారు. అన్నమయ్య, కోనసీమ, నెల్లూరు, గుంటూరు, తిరుపతి జిల్లాల్లో ఎందుకు నేరాలు అధికమయ్యాయో విశ్లేషించాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో గతంతో పోలిస్తే 5.5 శాతం మేర నేరాల రేటు తగ్గిందని వెల్లడించిన డీజీపీ హరీష్ కుమార్ గుప్తా తెలిపారు. అలాగే మహిళలపై నేరాలు గణనీయంగా తగ్గాయన్నారు. ఈ సమావేశంలో రాష్ట్రంలో శాంతి భద్రతలపై డీజీపీ హరీష్ కుమార్ గుప్తా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. 16 జిల్లాల్లో నేరాలు బాగా తగ్గాయని.. మిగతా జిల్లాల్లో వేర్వేరు కారణాల వల్ల క్రైమ్ ట్రెండ్ పెరుగుతోందని వివరించారు. అన్నమయ్య లాంటి జిల్లాలో మైగ్రేషన్ లేబర్ కారణంగా నేరాలు జరుగుతున్నాయని ఆయన సోదాహరణగా వివరించారు. కిడ్నాపింగ్ లాంటి కేసులు తగ్గుముఖం పట్టాయని పేర్కొన్నారు. 56 శాతం మేర డిటెక్షన్ రేట్, 55 శాతం మేర రికవరీ రేటు ఉందన్నారు. ఎన్టీఆర్, పశ్చిమగోదావరి జిల్లాల సహా ఐదు జిల్లాల్లో సీసీటీవీల అనుసంధానంతో నేరాలు క్రమంగా తగ్గుముఖం పట్టాయని చెప్పారు. డీహెచ్ఎంఎస్.. ఆధునిక సాంకేతికత ద్వారా సీసీ కెమెరాల హెల్త్‌ను నమోదు చేస్తున్నామన్న ఈ సమావేశంలో విజయవాడ నగర పోలీస్ కమిషనర్ రాజశేఖర బాబు వివరించారు. నగరంలో నిఘా కోసం 10 వేల సీసీ కెమెరాల డ్యాష్ బోర్డును కమ్యూనిటీ సహకారంతో రూపొందించామన్నారు. ఫేస్ రికగ్నిషన్ కెమెరాల ద్వారా నిందితుల్ని పట్టుకునే ప్రయత్నం చేస్తున్నామని సీపీ రాజశేఖర్ బాబు వెల్లడించారు.

# 10 నెలల్లో 8 యుద్ధాలు ఆపా..

మొదటి తరువాయి



పశ్చిమాసియాలో తొలిసారి శాంతిని నెలకొల్పా. ఎంతోమంది బందీలను విడుదల చేయించాను' అని ట్రంప్ తెలిపారు. అదేవిధంగా సుంకాల గురించి కూడా ట్రంప్ ప్రస్తావించారు. అమెరికాలో 18 ట్రిలియన్ డాలర్ల పెట్టుబడులు సాధించగలిగామని ఈ సందర్భంగా తెలిపారు. ఇదంతా సుంకాల కారణంగానే సాధ్యమైందన్నారు. ఈ సంద్భంగా అమెరికాకు చెందిన ప్రతి సైనికుడికి ట్రంప్ 1,776 డాలర్ల నగదు బహుమతి ప్రకటించారు. 1.45 మిలియన్లకు పైగా సైనికులు క్రిస్మస్ కానుగా ఒక్కొక్కరు 1,776 డాలర్ల నగదు అందుకుంటారని తెలిపారు. ఇది వారి సేవ, త్యాగానికి గుర్తింపుగా ఇస్తున్నట్లు పేర్కొన్నారు. సుంకాల కారణంగా ఎవరూ ఊహించనంత డబ్బు సంపాదించినట్లు చెప్పారు. ఇందుకు బిగ్ బ్యూటిఫుల్ బిల్లు సాయపడిందని ట్రంప్ వివరించారు.

# ప్రధాని మోడీకి మరో గౌరవం

మొదటి తరువాయి



చేయడంలో చేసిన కృషికి గుర్తింపుగా ఒమన్ సుల్తాన్ హైతం బిన్ తారిక్.. మోదీకి 'ఆర్డర్ ఆఫ్ ఒమన్' పురస్కారాన్ని ప్రదానం చేశారు. 'ఆర్డర్ ఆఫ్ ఒమన్' అనేది ఒమన్, విదేశీయులకు ఇచ్చే అత్యంత విశిష్టమైన పౌర పురస్కారం.భారత్ - ఒమన్ దేశాల మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 70 ఏళ్లు పూర్తయిన సందర్భంగా మోదీ ఒమన్‌లో పర్యటిస్తున్నారు. కాగా, ప్రధాని మోదీ ఇప్పటివరకు వివిధ దేశాల నుంచి 29 అత్యున్నత పౌర పురస్కారాలను అందుకున్నారు. ఇటీవల కువైట్ ప్రభుత్వం కూడా 'ఆర్డర్ ఆఫ్ ముబారక్ అల్-కబీర్'తో ఆయనను గౌరవించింది. బుధవారం ఇథియోపియా తన అత్యున్నత పురస్కారమైన 'నిషాన్ ఆఫ్ ఇథియోపియా'తో ప్రధాని మోదీని సత్కరించింది.

# స్థానిక ఎన్నికల్లో బలపడ్డాం

మొదటి తరువాయి

కూడా బీజేపీ బలం పెరుగుతుంది. కాంగ్రెస్ పార్టీ అధికార బలంతో, అవినీతి, అరాచకంతో గెలిచింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం బీజేపీ పథకాల పేరు మార్చి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. బీఆర్ఎస్ పార్టీ పని అయిపోయింది వారి అవినీతి గురించి వారి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజాపాలనలో మినిస్టర్ పీఏలు తుపాకులు పెట్టి బెదిరిస్తున్నారు, రాజ్యాంగం మీద గౌరవం లేని వ్యక్తి రాహుల్ గాంధీ. బీఆర్ఎస్ పార్టీనే ఫిరాయింపుల మొదటి ప్రోత్సహించింది. ప్రభుత్వం ఒత్తిడితో స్పీకర్ రాజ్యాంగం వ్యతిరేకంగా తీర్పు ఇచ్చారు. రాహుల్ గాంధీ సోనియాగాంధీ వారి వారి కేసులలో బెయిల్ పై ఉన్నారు. బీజేపీ వారిపై కేసు పెట్టలేదు దర్యాప్తు సంస్థలు కేసు పెట్టాయి. మా పార్టీ కార్యాలయంలపై దాడి చేస్తే లా అండ్ ఆర్డర్ ప్రాబ్లమ్ వస్తే కాంగ్రెస్ పార్టీదే పూర్తి బాధ్యత' అని రామచంద్రరావు పేర్కొన్నారు.


# రైల్వే ప్రయాణీకులకు గుడ్‌న్యూస్..

మొదటి తరువాయి

ౕహాడల్‌లో రైల్వేస్టేషన్లలో వైఫై సేవలను ప్రారంభించారు. వెయిటింగ్‌లో ప్రయాణీకులకు ఇంటర్నెట్ సదుపాయం కల్పించడం, డిజిటల్ ఇండియా ప్రచారాన్ని బలోపేతం చేయడమే దీని ఉద్దేశం. ఈ సౌకర్యం పెద్ద సంఖ్యలో ప్రయాణీకులకు స్టేషన్‌లో టికెట్ బుకింగ్, ప్రయాణ సమాచారం, ఇతర ఆన్‌లైన్ సేవలను సులభంగా యాక్సెస్ చేయడానికి వీలు కల్పిస్తుంది. రైల్వే స్టేషన్లలో వై-ఫైని యాక్సెస్ చేయడానికి, ప్రయాణీకులు తమ మొబైల్ నంబర్ ద్వారా ఓటీపీని నమోదు చేయాల్సి ఉంటుందని మంత్రిత్వశాఖ స్పష్టం చేసింది. గుర్తింపు రుజువు, ఈ-మెయిల్ తదితర వ్యక్తిగత సమాచారం ఏమీ అవసరం లేదని స్పష్టం చేసింది. ఈ వ్యవస్థలో ప్రయాణీకుల గోప్యత, డేటా భద్రతను నిర్ధారించనున్నట్లు తెలిపింది. ఏదైనా స్టేషన్‌లో వైఫైలో సాంకేతిక సమస్య తలెత్తితే.. రైల్వే పరిపాలన వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటుంది. ప్రయాణీకులకు అంతరాయం లేకుండా ఇంటర్నెట్‌ను అందించేందుకు ఈ ఫెసిలిటీని తీసుకువచ్చింది. రైల్వే ప్రయాణీకుల భద్రతను బలోపేతం చేయడానికి, స్టేషన్లు-కోచ్‌లలో సీసీటీవీ నెట్‌వర్క్‌ను వేగంగా విస్తరిస్తున్నట్లు రైల్వే మంత్రిత్వ శాఖ పార్లమెంట్‌లో మరో ప్రశ్నకు సమాధానంగా తెలిపారు. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 1,731 రైల్వే స్టేషన్లు, 11,953 కోచ్‌లలో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కెమెరాలు మూలధన వ్యయంతో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపింది. దేశంలోని అత్యంత రద్దీగా ఉండే రైల్వే స్టేషన్లలో ఒకటైన న్యూఢిల్లీ రైల్వే స్టేషన్‌లో, ఎంట్రీ-ఎగ్జిట్ పాయింట్లు, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, ప్లాట్‌ఫారమ్‌లు, వెయిటింగ్ హాల్స్, టికెట్ కౌంటర్ల వద్ద భద్రత కోసం ఇప్పటికే సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం, న్యూఢిల్లీ రైల్వే స్టేషన్‌లో మొత్తం 250 సీసీటీవీ కెమెరాలు పనిచేస్తున్నాయి.

# బీజేపీ కక్ష్యపూరిత రాజకీయాలు మానుకోవాలి

## టీపీసీసీ సభ్యులు ఆయిళ్ళ శ్రీనివాస్ గౌడ్



**శంషాబాద్, డిసెంబర్ 18(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు నేషనల్ హెరాల్డ్ కేసు విషయంలో బీజేపీ ప్రభుత్వం రాజకీయ కక్షతో పెట్టిన ఈడీ కేసులను ఢిల్లీ కోర్టు తప్పు పట్టిన నేపథ్యంలో, ప్రజలకు ఈ విషయాన్ని వివరించేందుకు శంషాబాద్ అంబేద్కర్ విగ్రహం వద్ద భారీ నిరసన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు చల్లా నరసింహ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, కార్పొరేషన్ చైర్మన్లు రామి రెడ్డి, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, టీపీసీసీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీపీసీసీ సభ్యులు ఆయిళ్ళ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ –

గాంధీ, నెహ్రూ కుటుంబం దేశానికి త్యాగాల కుటుంబమని, నెహ్రూ తన జీవితం తో పాటు ఆస్తులను దేశానికి అర్పించారని, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీలు దేశం కోసం ప్రాణాలు అర్పించారని గుర్తుచేశారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీలు ప్రధానమంత్రి అయ్యే అవకాశాన్ని రెండు సార్లు త్యాగం చేసి హుందాతనాన్ని చాటారని అన్నారు. 1938లో స్వాతంత్ర్య సమరయోధులతో కలిసి నెహ్రూ ప్రారంభించిన నేషనల్ హెరాల్డ్ పత్రికను నేడు కాంగ్రెస్ నాయకులు ఆదుకోవడానికి చేసిన ప్రయత్నం నచ్చక బీజేపీ ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టి వేధిస్తోందని విమర్శించారు. ఢిల్లీ కోర్టు ఈడీ చర్యలను తప్పు పట్టి చివాట్లు వేసిందని, యావత్ దేశం సోనియా, రాహుల్‌లకు అండగా ఉంటుందని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధి దేశాభివృద్ధి అని నమ్మిన మహాత్మా గాంధీ కలల నిమిత్తం యూపీఏ ప్రభుత్వం మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టిందని, కానీ బీజేపీ ప్రభుత్వం దానిని తగ్గించి కార్పొరేట్లకు మాత్రమే మేలు చేస్తోందని, పేదలకు వ్యతిరేకమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ అనిత రెడ్డి, జగదీశ్వర్ గౌడ్, ఏనుగు జంగా రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, రాం మోహన్ గౌడ్, శివ కుమార్, డీసీసీ ప్రతినిధి శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నర్సింహ ముదిరాజ్, రాష్ట్ర గిరిజన సేవా సంఘం అధ్యక్షులు హనుమా నాయక్, గూడూరు భాస్కర్ రెడ్డి, బిచ్య నాయక్, డోకూరు ప్రభాకర్ రెడ్డి, సుదర్శన్ గౌడ్, చందోజీ, శ్రీశైలం, మల్లేష్, మోహన్ రాజేష్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి

## ఎమెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి




**ఆమనగల్లు, డిసెంబర్ 18(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
గ్రామాల అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. గురువారం హైదరాబాద్ లో ఎమ్మెల్యే నివాసంలో ఇటీవల రెండో విడుత పల్లె పోరులో మేడిగడ్డ సర్పంచి, ఉప సర్పంచిగా ఎన్నికైన రాజేశ్వరి, విజయ్ రాథోడ్ పాలక వర్గ సభ్యులను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం పాటుపడుతుందన్నారు. పల్లెల అభివృద్ధికి అందరూ కలిసి కృషి చేయాలన్నారు. పార్టీలకు అతీతంగా అర్హులైన వారందరికీ ప్రభుత్వ పథకాలు అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మల్లేష్, ప్రేమి, హన్మ, జయందర్, భాస్కర్, సీతరాం, కవిత, మణిపాల్, దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో షాబాద్ డిప్యూటీ సర్పంచ్‌కు సన్మానం



**షాబాద్, డిసెంబర్ 18(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు గందె సురేష్ ఆధ్వర్యంలో షాబాద్ డిప్యూటీ సర్పంచ్‌గా ఎన్నికైన దండు రాహుల్ గుప్తాను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గందె సురేష్ మాట్లాడుతూ ఆర్యవైశ్య యువత రాజకీయాల్లో రాణించాలని ఆకాంక్షించారు. రాహుల్ గుప్తా ఎన్నిక ఆ దిశగా నిదర్శనమని కొనియాడుతూ, షాబాద్ అభివృద్ధికి ఆయన కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో షాబాద్ మండల అధ్యక్షులు సాయిరాం, ఫరూక్‌నగర్ మండల అధ్యక్షులు ఎల్కుర్తి నారాయణ, మాజీ మండల అధ్యక్షులు హన్మరి మురళీధర్, జిల్లా మెంబర్షిప్ కమిటీ చైర్మన్ మల్పెది శ్రీనివాస్, జిల్లా యువజన సంఘం కోశాధికారి సామాజికవేత్త నీల రవీందర్, జిల్లా కమిటీ సభ్యులు బండారు శంకర్, గాజవాడ యశ్వంత్ రాజ్, శివ కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ఏక్తా పార్టీ రాష్ట్ర మహిళా విభాగ అధ్యక్షురాలిగా గడ్డం పద్మజా




**హైదరాబాద్, డిసెంబర్ 18(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
మల్కాజ్‌గిరి అసెంబ్లీ నియోజకవర్గం నుండి ఎమ్మెల్యేగా పోటీ చేసిన గడ్డం పద్మజాను ప్రజా ఏక్తా పార్టీ (పీఈపీ) తెలంగాణ రాష్ట్ర మహిళా విభాగ అధ్యక్షురాలిగా నియమించారు. పార్టీ వ్యవస్థాపకుడు, జాతీయ అధ్యక్షుడు బొనాల శ్రీనివాస్ ఈ నియామకాన్ని అధికారికంగా ప్రకటించారు. పద్మజా రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషిస్తూ, మహిళా శక్తిని సమాజ అభివృద్ధి దిశగా వినియోగించాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నారు. ఆమె నియామకం ద్వారా రాష్ట్ర మహిళా విభాగం మరింత బలోపేతం అవుతుందని పార్టీ వర్గాలు విశ్వాసం వ్యక్తం చేస్తున్నాయి.

# నూతన డీసీసీ అధ్యక్షునికి సన్మానం



**కరీంనగర్ రూరల్, డిసెంబర్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ జిల్లా నూతన డీసీసీ అధ్యక్షుడిగా నియమితులైన చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను బొమ్మకల్, 6వ డివిజన్ నాయకులు మిడిదొడ్డి కపిల్ మాధవ, బూస సాయి కృష్ణ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముత్యం శంకర్, మిర్యాల శ్రీధర్ రెడ్డి, బైరిశెట్టి సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడికి దివ్యాంగుల శుభాకాంక్షలు



**మేడ్చల్, డిసెంబర్ 18(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా ఇటీవల ఎన్నికైన తోటకూర వజ్రేష్ యాదవ్‌ను గురువారం నాడు జిల్లా దివ్యాంగుల నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు జిల్లాలో ఉన్న పలు దివ్యాంగుల సమస్యలను వివరించారు. వజ్రేష్ యాదవ్ స్పందిస్తూ తన రాజకీయ ప్రస్థానం ఆరంభం నుంచే దివ్యాంగులకు కావాల్సిన విల్‌చైర్లు, ట్రైసైకిళ్లు, చంకకర్రలు అందజేశానని, దివ్యాంగులు తనకు అత్యంత సన్నిహితులని పేర్కొన్నారు. "మీకు ఎలాంటి అవసరం ఉన్నా నేరుగా నా దగ్గరకు రావచ్చు. ప్రజా ప్రభుత్వంలో సంక్షేమ పథకాల ద్వారా మీకు మరింత లబ్ధి చేకూరేలా కృషి చేస్తాను" అని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా నాయకులు బత్తిని బిక్షపతి గౌడ్, చిప్పల శ్రీధర్, ఆవుల పాండు యాదవ్, తుక్కోజీ అమరేందర్, పెద్దమెత్తరి రాము, డి. శ్రీను, బి. రమేష్, ఎం. సాయి, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

# తొలిసారి ఓటు హక్కు వినియోగించుకున్న క్రీడాకారిణిలు






**ఎలిగేడు, డిసెంబర్ 18 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఎలిగేడు మండల కేంద్రంతో పాటు సుల్తానాపూర్ లో జరిగిన మూడవ విడత గ్రామపంచాయతీ ఎన్నికల్లో అంతర్జాతీయ ఆర్చరీ క్రీడాకారిణి బంగారు పతకం విజేత తానిపర్తి చికిత ఎస్ జి ఎఫ్ నేషనల్ చదరంగం క్రీడాకారిణి తాటిపల్లి వినీల తొలిసారిగా ఓటు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అనేది చాలా విలువైనదని అలాంటి ఓటు ఈరోజు మొట్టమొదటి సారీ ఓటు వేయడం చాలా ఆనందంగా ఉందని వివిధ ప్రాంతాల్లో మేము ఉన్నప్పటికీ స్వగ్రామాలకు వచ్చి ఓటు వేయడం జరిగిందని అన్నారు.

# ఉచిత వైద్యంతో పాటు ప్రజల సమస్యలు పరిష్కరించడమే నా లక్ష్యం- బి.కే.ఆర్




**కుత్బుల్లాపూర్, డిసెంబర్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని గండి మైసమ్మ 120 చంద్రశేఖర్ రెడ్డి కాలనీలో బి.కే.ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఫౌండేషన్ అధ్యక్షులు బొంగునూరి కిషోర్ రెడ్డి హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలు నివసిస్తున్న కాలనీలలో ఉచిత వైద్య సేవలను మరింత వేగవంతం చేస్తామని తెలిపారు. వైద్యంతో పాటు కాలనీలలో నెలకొన్న సమస్యలను ప్రజలు తన దృష్టికి తీసుకువస్తున్నారని, ప్రజల మధ్యలో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు. మమత హాస్పిటల్ వైద్య బృందానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏ.ఆర్. సాదు యాదవ్, మాజీ సర్పంచ్ కావలి గణేష్, సైద్ భాయ్ మొహమ్మద్ కాసిం, మోసిన్, మహిళా కాంగ్రెస్ నాయకురాలు ఫాతిమా, రచ్చ నాయక్ శ్రీశైలం యాదవ్‌తో పాటు కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ బస్తీబాట సన్నాహక సమావేశం



**ఆమనగల్లు, డిసెంబర్ 18(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఆమనగల్లు పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బస్తీబాట సన్నాహక సమావేశం గురువారం జరిగింది. ఈ సమావేశానికి మున్సిపాలిటీ అధ్యక్షుడు పత్య నాయక్ హాజరై నాయకులు, కార్యకర్తలతో కలిసి మాట్లాడారు. ఈనెల 20వ తేదీ నుంచి ఆమనగల్లు అభివృద్ధి కోసం అన్ని వార్డులలో ప్రజల సలహా, సూచనల మేరకు రాజకీయాలకు అతీతంగా బస్తీబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజలతో నేరుగా మమేకమై వారి అభిప్రాయాలను తెలుసుకోవడం ద్వారా పట్టణ అభివృద్ధి సాధ్యమవుతుందని, ఈ కార్యక్రమం పార్టీ బలోపేతానికి దోహదం చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొని ఉత్సాహాన్ని వ్యక్తం చేశారు.


# అన్నదానం మహాదానం

## సర్పంచ్ రాయికంటి బిక్షపతి



**కద్తాల్, డిసెంబర్ 18(నీలగిరి ఎక్స్ ప్రెస్)** కద్తాల్ బస్టాండ్ ఆవరణలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు, లయన్స్ క్లబ్ ఆఫ్ బాలాజీ నగర్ ఆధ్వర్యంలో జి. చెన్నకిషన్ రెడ్డి తండ్రి శేషులు వెంకట్ రాజిరెడ్డి 14వ వర్ధంతి సందర్భంగా అన్నదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ కె. గోవర్ధన్ రెడ్డి, నూతన సర్పంచ్ రాయికంటి బిక్షపతి కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బిక్షపతి మాట్లాడుతూ అన్నదానం మహాదానమని, ఆకలితో అలమటిస్తున్న పేద ప్రజలకు ఆహారం అందించడం లయన్స్ క్లబ్ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. నియోజకవర్గ స్థాయిలో క్లబ్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. లయన్స్ క్లబ్ సేవలను మరింత విస్తృతం చేస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో భాగంగా 350 మందికి అన్నదానం ఏర్పాటు చేసినట్లు లయన్స్ క్లబ్ పిఆర్‌ఓ ఎం.ఏ. పాషా వెల్లడించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన సర్పంచ్ బిక్షపతిని లయన్స్ క్లబ్ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు కె. గోవర్ధన్ రెడ్డి, కార్యదర్శి లయన్ గంప శ్రీను, కోశాధికారి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా చైర్మన్ జూలూరు రమేష్, ఉపాధ్యక్షులు ఎంగళి బాలకృష్ణ, సభ్యులు కర్నాటి కొండారెడ్డి, జాంగిర్ అలీ, వేణు పంతులు, జలకం రమేష్, ముత్తి కృష్ణ, మహేష్, లాయక్ అలీ, మల్లేష్, తరుణ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.


# డిమాండ్లు నెరవేర్చితేనే భూములు ఇస్తాం: గిరిజన రైతులు



**ఆమనగల్లు, డిసెంబర్ 18(నీలగిరి ఎక్స్ ప్రెస్)** గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్ పేరుతో సాగుతున్న భూసేకరణ ప్రక్రియపై గిరిజన రైతులు గట్టిగా స్వరం వినిపించారు. తమ డిమాండ్లను ప్రభుత్వం పూర్తిగా నెరవేర్చిన తర్వాతనే భూసేకరణ చేపట్టాలని, లేకపోతే భూములు ఇచ్చే ప్రసక్తే లేదని రంగా రెడ్డి జిల్లా కలెక్టర్‌కు ఆమనగల్ మండలం సాకబండ తండాకు చెందిన గిరిజన రైతులు ఖరాఖండిగా స్పష్టం చేశారు. రావిర్యల నుంచి ఆమనగల్ వరకు గ్రీన్‌ఫీల్డ్ రోడ్డుకు గిరిజన రైతుల భూములను స్వాధీనం చేసుకోవాలని అధికారులు చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో, ఈరోజు రంగా రెడ్డి జిల్లా కలెక్టర్‌తో గిరిజన రైతుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రైతులు తమ ఆవేదనను, డిమాండ్లను స్పష్టంగా వివరించారు. భూములు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారంగా ఎకరాకు రూ.1 కోటి 20 లక్షలు ఇవ్వాలని, ఫ్యూచర్ సిటీలో 500 గజాల స్థలం కేటాయించాలని, అలాగే భూములు కోల్పోయే ప్రతి కుటుంబానికి ఒకరికి ఉద్యోగం కల్పించాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ హామీలను ప్రభుత్వం లిఖితపూర్వకంగా ప్రకటించిన తర్వాతనే భూ సర్వే చేపట్టాలని, లేకపోతే భూ సర్వే చేయవద్దని కలెక్టర్‌ను కోరారు. మూడు పంటలు పండే తమ పచ్చని పొలాలు తమ జీవనాధారం అని, ప్రభుత్వం అభివృద్ధి పేరుతో పేద గిరిజన రైతుల జీవితాలను నాశనం చేయవద్దని వారు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పథకాలు ఇవ్వకపోయినా పర్వాలేదని, కానీ తమ పొట్ట కొట్టే భూములను లాక్కొని కుటుంబాలను రోడ్డున పడేయవద్దని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనుల బాగు కోసం, పేద కుటుంబాల జీవితాల్లో వెలుగు నింపే కార్యక్రమాలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ డిమాండ్లను ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం అంగీకరించిన తర్వాతే భూములు ఇస్తామని రైతులు కలెక్టర్‌కు మరోసారి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పత్యా నాయక్, బోడియ నాయక్, రవి రాథోడ్, బాలు నాయక్, రాజేందర్, మణిపాల్, జైపాల్, శివరాం, గన్యా, పాండు, విజేందర్, శ్రీనివాస్ రెడ్డి, రాజు రెడ్డి, లక్ష్మారెడ్డి, గోపి తదితర రైతులు, రైతు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గులాబీ జెండాను గుండెలకు హత్తుకున్నరు ప్రజలు

**-ప్రభుత్వ నిర్లక్ష్యంతో పంచాయతీలు నిర్వీర్యం**
**-ప్రభుత్వం పతనం అంచులో ఉంది**
**-మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి**



**వనపర్తి,డిసెంబర్ 18( నీలగిరి ఎక్స్ ప్రెస్ )** :సకాలంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించలేకపోవడం ప్రభుత్వ అసమర్థతకే నిదర్శనమని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి విమర్శించారు. పంచాయతీ ఎన్నికలను ప్రభుత్వం ఆలస్యం చేయడం వల్ల గ్రామ పంచాయతీలు నిర్వీర్యం అయ్యాయని అన్నారు. ప్రభుత్వ పనితీరు బాగుంటే ప్రజలు బ్రహ్మరథం పడతారని, కానీ ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర అసహనం, అసంతృప్తితో ఓటు ద్వారా బుద్ధి చెప్పారని పేర్కొన్నారు. పార్టీపరంగా జరిగిన ఎన్నికలు కాకున్నా గులాబీ జెండా, కేసీఆర్ బొమ్మ, స్థానిక నాయకులు కనిపిస్తే చాలు ప్రజలు గుండెలకు హత్తుకున్నారని తెలిపారు. ఇది ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న అసంతృప్తి ఎంత తీవ్రంగా ఉందో స్పష్టం చేస్తుందని అన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థులకు ప్రజలు ఇచ్చిన మద్దతు చూస్తే ఈ ప్రభుత్వం పతనం అంచులో ఉందని అర్థమవుతోందని, అందుకే బీఆర్ఎస్ విజయ దుందుభి మోగించిందని వ్యాఖ్యానించారు. అధికార పార్టీ ఎన్ని అరాచకాలు, దౌర్జన్యాలు, ప్రలోభాలు, మాయమాటలకు పాల్పడినా ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారని చెప్పారు. "బీఆర్ఎస్ ఎక్కడుంది, పార్టీని బొంద పెట్టినం" అన్నవాళ్లకు ఈ విజయం చెంపపెట్టులాంటిదని ఘాటుగా విమర్శించారు. ఈ విజయం ముఖ్యమంత్రి రేవంత్ అహంకారానికి గుణపాఠమని పేర్కొంటూ, ఇంతటి విజయాన్ని అందించిన ప్రజలకు, కృషి చేసిన నాయకులు, కార్యకర్తలకు శుభాకాంక్షలు, ధన్యవాదాలు తెలిపారు.

# బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేసిన తరువాతే జెడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికలు నిర్వహించాలి

-ఇరగదిండ్ల కృష్ణ



**దేవరకొండ, డిసెంబర్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** జెడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేసిన తర్వాతే ఎన్నికలు జరగాలని వడ్డెర సంఘం దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు, బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు ఇరగదిండ్ల కృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీసీలలో పెరిగిన చైతన్యం కారణంగానే ఇటీవల జరిగిన మూడు విడతల గ్రామపంచాయతీ ఎన్నికలలో 50 శాతం పైగా బీసీలు సర్పంచులుగా, ఉప సర్పంచులుగా ఎన్నికయ్యారని గుర్తు చేశారు. బీసీ రిజర్వేషన్‌పై హైకోర్టు తీర్పు వెలువడిన తర్వాతనే జెడ్పిటిసి, ఎంపిటిసి, పురపాలక ఎన్నికలు నిర్వహించాలని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ నియోజకవర్గ వడ్డెర సంఘం ఉపాధ్యక్షుడు ఈ. వెంకటేష్, వరికుప్పల రాములు, బాలరాజు, ఈ. రాములు, గోగుల నరసింహ, వరికుప్పల శ్రీను, సంపంగి సైదులు, ఈ. శ్రీను, దాసర్ల నరసింహ, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# సింగంపల్లి గ్రామంలో మాస శివరాత్రి వేడుకలు



**ఆమనగల్లు,డిసెంబర్ 18(నీలగిరి ఎక్స్ ప్రెస్)** మార్గశిర కృష్ణ చతుర్దశి మాస శివరాత్రి సందర్భంగా ఆమనగల్లు మండలంలోని సింగంపల్లి గ్రామం కాశీవిశ్వనాథ స్వామి దేవాలయంలో మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం ఘనంగా నిర్వహించారు. కల్వకుర్తి వైదిక బ్రాహ్మణ పరిషత్తు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా బ్రాహ్మణ పరిషత్తు గౌరవాధ్యక్షులు సుధీర్ శర్మతో పాటు పరిషత్తు సభ్యులు అనంతుని సీతారామ సిద్ధాంతి, జయంత్ కుమార్ వెంకటేశ్వర శర్మలు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ ప్రాంగణం భక్తుల నినాదాలతో మార్మోగి ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

# గ్రామ పంచాయతీ ఎన్నికల అనంతరం బీజేపీ కీలక నిర్ణయం

**మంచాల, డిసెంబర్ 18(నీలగిరి ఎక్స్ ప్రెస్)** నిన్న జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ కార్యకర్తల కృషి ఎంతగానో ఉందని పార్టీ నాయకులు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరికీ పేరుపేరున ధన్యవాదాలు తెలిపారు. అయితే పార్టీ గెలుపుకోసం పనిచేయకుండా వ్యతిరేకంగా వ్యవహరించిన సీనియర్ నాయకులు, కార్యకర్తలు, పదవధికారులను పార్టీ నిర్ణయం మేరకు సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. కొంతమంది వ్యక్తులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం పార్టీ విజయాన్ని దుర్వినియోగం చేసినందున వారిని పార్టీ నుండి తొలగిస్తున్నట్లు స్పష్టం చేశారు. తొలగించబడినవారిలో మాదగొని ముఖేష్, మహంకాళి వెంకన్న, బండి బాలయ్య, పగిళ్ల నరసింహ, అయితగోని రాజు, మాదగొని జంగయ్య, ఓరుగంటి మహేష్, నారి శ్రీశైలం ఉన్నారని పార్టీ వెల్లడించింది. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి కారింగు రాజు గౌడ్, లోయపల్లి శక్తి కేంద్రం ఇంచార్జి కలగోని శేఖర్ గౌడ్, బూత్ అధ్యక్షులు బండి వెంకట్ గౌడ్, చెరుకు శివ, మాదగోని సైదులు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# జంగారెడ్డిపల్లి సర్పంచ్ పసుల మల్లేష్‌కి ఘన సన్మానం



**తలకొండపల్లి, డిసెంబర్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** తలకొండపల్లి మండల పరిధిలోని జంగారెడ్డిపల్లి గ్రామ సర్పంచ్‌గా 300 మెజారిటీతో విజయం సాధించిన బీఆర్ఎస్ అభ్యర్థి పసుల మల్లేష్‌ను తెలంగాణ రాష్ట్ర మాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మన్, తలకొండపల్లి మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేష్ శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉప్పల వెంకటేష్ మాట్లాడుతూ కొత్తగా ఎన్నికైన నాయకులు గ్రామాలను అభివృద్ధి వైపు నడిపించాలని సూచించారు. ప్రభుత్వం ద్వారా వచ్చిన ప్రతి పథకం పేద ప్రజలకు అందేలా చూడాలని ఆయన పిలుపునిచ్చారు. అదేవిధంగా జంగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ తిరుమణి నిర్మల శ్రీశైలం గౌడ్ కూడా భారీ మెజారిటీతో గెలవడంపై అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీతో పాటు సర్పంచ్ మల్లేష్, ఉప సర్పంచ్ మంజుల వెంకటరెడ్డి, వార్డు సభ్యులు తిరుమణి శేఖర్ గౌడ్, రజిత రమేష్, పావని కృష్ణ, లక్ష్మి కృష్ణయ్య, మనోహర్, గ్రామ పెద్దలు మరియు ఇతరులు పాల్గొన్నారు.

# ఘనంగా అయ్యప్ప పడిపూజ



**కరీంనగర్, డిసెంబర్ 18(నీలగిరి ఎక్స్‌ప్రెస్)** భగత్‌నగర్ మల్లమ్మ మార్కెట్ వద్ద విశ్వనాథ్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఈరోజు అయ్యప్ప పడిపూజ మరియు భిక్ష కార్యక్రమం ఘనంగా జరిగింది. గురుస్వామి బొల్లం నరేందర్ ప్రత్యేక పూజలు నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అయ్యప్ప స్వామికి అభిషేకం, భజనలు, పడిపూజ అనంతరం భిక్ష కార్యక్రమం నిర్వహించగా, భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా 150 మంది అయ్యప్ప స్వాములు హాజరై ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింత ఉత్సాహభరితంగా మార్చారు.

# ధ్యాన మహోత్సవాలకు కడ్తాల్ పిరమిడ్ సర్వం సిద్ధం

- ఈ నెల 21నుంచి 31వరకు ధ్యాన అంతర్జాతీయ దినోత్సవ సంబరాలు
-భారీగా తరలిరానున్న తెలుగు రాష్ట్రాల ధ్యానులు
- వివరాలు వెల్లడించిన పిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి






**కడ్తాల్, డిసెంబర్ 18 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ ) :** రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మహేశ్వర మహా పిరమిడ్ అంతర్జాతీయ ధ్యాన దినోత్సవ మహోత్సవాలకు సర్వం సిద్ధమైంది. ప్రతియేటా డిసెంబర్ నెలలో నిర్వహించే ఈ ఉత్సవాలకు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి ధ్యానులు భారీగా తరలిరానున్నారు. ఈ నేపథ్యంలో పిరమిడ్ ట్రస్ట్ సభ్యులు ఏర్పాట్లను పూర్తి చేస్తున్నారు. లక్షలాదిగా తరలిరానున్న ధ్యానులకు వసతులు కల్పిస్తున్నారు. వివిధ రాష్ట్రాల నుంచి పిరమిడ్ మాస్టర్లు, ధ్యానులు కడ్తాల్ పిరమిడ్ కు తరలిరానున్నారు. పదకొండు రోజుల పాటు ధ్యానం, ఆధ్యాత్మిక ప్రవచనాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ధ్యాన గురువుల సందేశాలు నిర్వహించనున్నారు. ధ్యాన మహోత్సవాలకు భారీఏర్పాట్లు చేస్తున్నట్లు గురువారం పిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి విలేకరుల



సమావేశంలో వెల్లడించారు. ఈ నెల 21నుంచి 31వరకు ధ్యాన దినోత్సవ సంబురాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివిధ రాష్ట్రాలతో పాటు విదేశాల నుంచి ధ్యాన గురువులు, పిరమిడ్ మాస్టర్లు కడ్తాల్ పిరమిడ్ కు హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో పిరమిడ్ ట్రస్ట్ సభ్యులు దామోదర్ రెడ్డి, మాధవి, మీడియా కోర్డినేటర్ విజయ్ భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్ ఫామ్ సాగు పెంపుపై సిద్దిపేట కలెక్టర్ సమీక్ష

## నారాయణపేట ఆరోగ్య కేంద్రం సందర్శన



**సిద్దిపేట, డిసెంబర్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** జిల్లాలో ఆయిల్ ఫామ్ సాగు పెంపుపై జిల్లా కలెక్టర్ కె. హైమావతి గురువారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఉద్యానవన శాఖ, ఆయిల్ ఫ్రైడ్, మైక్రో ఇరిగేషన్ కంపెనీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ఇప్పటివరకు 13,576 ఆయిల్ ఫామ్ ప్లాంటేషన్ జరిగినట్లు వెల్లడించారు. ఈ సంవత్సరం 6,500 ఎకరాల లక్ష్యానికి గాను 2,998 ఎకరాలకు శాంక్షన్ ఇచ్చి, 1,536 ఎకరాల్లో మాత్రమే ప్లాంటేషన్ పూర్తయిందని ఆశించిన స్థాయిలో సాగు జరగలేదని అసహనం వ్యక్తం చేశారు. ఖరీఫ్ సీజన్ ముగిసినందున రబీ సీజన్‌కు ముందే ప్రతి గ్రామంలో రైతులతో సమావేశాలు నిర్వహించి ఆయిల్ ఫామ్ సాగు విస్తరణకు అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. ప్రత్యేక డ్రైవ్‌గా ఈ వారం కార్యక్రమాలు చేపట్టి, రైతులకు సక్సెస్ స్టోరీలు చూపించి ప్రోత్సాహం కలిగించాలని సూచించారు. శాంక్షన్ పొందిన రైతులు త్వరగా ఫిట్టింగ్, ప్లాంటింగ్ పూర్తి చేయాలని, డ్రిప్ సిస్టమ్ అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఆయిల్ ఫామ్ సాగు లాభదాయకమని, మొదటి రెండు సంవత్సరాలు అంతర పంటలు వేసుకోవచ్చని, మూడవ సంవత్సరం నుంచి గెలలు, నాలుగో సంవత్సరం నుంచి పంట లభిస్తుందని రైతులకు నమ్మకం కలిగించేలా అధికారులు పని చేయాలని సూచించారు. జిల్లాలో ఆయిల్ ఫామ్ కర్మాగారం ఉన్నందున విస్తృతంగా ప్లాంటేషన్ చేయాలని, విధుల్లో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తరువాత కలెక్టర్ నారాయణరావుపేట మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రోగులకు అందించే వైద్య సేవలను పరిశీలించారు. అటెండెన్స్, ఓపి రిజిస్టర్‌ను పరిశీలించి రికార్డు సక్రమంగా నిర్వహించకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. మైనర్ రిపేర్లు త్వరగా పూర్తి చేయాలని, మెడిసిన్, వైద్య పరికరాలు సమృద్ధిగా ఉండేలా చూసుకోవాలని, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని మెడికల్ ఆఫీసర్ మరియు సిబ్బందిని ఆదేశించారు. అనంతరం నారాయణరావుపేట గ్రామపంచాయతీలోని ఆయుష్ ఆరోగ్య మందిరాన్ని సందర్శించి అక్కడ జరుగుతున్న సేవలను పరిశీలించారు. ఆయుష్ సేవలను మరింత విస్తరించాలని డాక్టర్‌కు సూచించారు.

## గ్రామపంచాయతీ ఎన్నికల బందోబస్తులో విశిష్ట సేవలకు పోలీసులకు ప్రశంసా పత్రాలు – రివార్డులు

**మహబూబాబాద్, డిసెంబర్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** : జిల్లాలో మూడు విడతలుగా నిర్వహించిన గ్రామపంచాయతీ ఎన్నికలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా, విజయవంతంగా పూర్తయిన నేపథ్యంలో జిల్లా ఎస్పీ డా. శబరీష్ టౌన్ పోలీస్ స్టేషన్ సమావేశ మందిరంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముందుగా జిల్లా పోలీసింగ్ కార్యాచరణ ప్రణాళికపై విస్తృతంగా చర్చించారు. ప్రజా పిటిషన్లు, ఫిర్యాదుల పరిష్కారం, నివారణాత్మక పోలీసింగ్, కమ్యూనిటీ అనుసంధానం అంశాలను సమీక్షించారు. సైబర్ నేరాలు, పాక్సో కేసులు, మాదక ద్రవ్యాలు, అక్రమ మద్యం, ట్రాఫిక్ మరియు రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన పెంచాలని సూచించారు. అలాగే సీసీటీవీ




పర్యవేక్షణ, సీసీటీఎన్ఎస్ వంటి ఆధునిక సాంకేతికత వినియోగం, మద్యం మత్తులో వాహనాలు నడపడం, మైనర్ డ్రైవింగ్, హెల్మెట్ ఉల్లంఘనలు, నంబర్ ప్లేట్లు లేని వాహనాలు, వాహనాలు నడుపుతూ మొబైల్ వినియోగం వంటి అంశాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆటో, టాక్సీ డ్రైవర్లకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఆస్తి నేరాలు, మాదక ద్రవ్యాలు, అక్రమ మద్యం, జూదం, ఆర్థిక మోసాలు, భూవివాదాలు, రైతులకు సంబంధించిన యూరియా పంపిణీ వంటి అంశాల్లో ముందస్తు నివారణ చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. పోలీస్ సిబ్బంది ప్రవర్తన, క్రమశిక్షణ, బాధ్యతతో పాటు దర్యాప్తు ప్రక్రియలు, కోర్టు పర్యవేక్షణను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. తరువాత గ్రామపంచాయతీ ఎన్నికల బందోబస్తు, భద్రతా చర్యల్లో విశిష్ట సేవలు అందించిన పోలీస్ అధికారులు, సిబ్బందిని ఎస్పీ డా. శబరీష్ అభినందించారు. ఎన్నికల విధుల్లో నిబద్ధతతో పనిచేసిన అధికారులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. అదేవిధంగా అన్ని స్థాయిల పోలీస్ సిబ్బందికి రివార్డులను మంజూరు చేశారు. టీమ్ వర్క్ వలన ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని ఎస్పీ ప్రత్యేకంగా ప్రశంసించారు.

# తాగునీటి సమస్యను పరిష్కరించిన సర్పంచ్ రాయికంటి బిక్షపతి



**కడ్తాల్, డిసెంబర్ 18 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )** కడ్తాల్ గ్రామపంచాయతీలోని 7, 8 వార్డులకు సంబంధించిన తాగునీటి బోరుపంపు కొన్ని రోజులుగా నీళ్లు రాకుండా రిపేర్ ఉండడంతో వెంటనే స్పందించి బోర్ పంపు రిపేరు చేసి త్రాగునీటి సమస్యను పరిష్కరించిన కడ్తాల్ పట్టణ నూతన సర్పంచ్ రాయికంటి బిక్షపతి, అదేవిధంగా కార్యక్రమంలో కడ్తాల్ ఉప సర్పంచ్ ఈరెడ్డి యాదగిరి రెడ్డి, స్థానిక నాయకులు పిప్పళ్ల యాదయ్య, వరికుప్పల సత్యం, కోస్కే యాదయ్య, ఇమ్రాన్ బాబా, కాలనీవాసులు ఉన్నారు.

# ఉప సర్పంచ్ జర్పుల లక్పతి నాయక్ కు ఘన సన్మానం



**కడ్తాల్, డిసెంబర్ 18 ( నీలగిరి ఎక్స్ ప్రెస్) :** హైదరాబాద్ లో కల్వకుర్తి ఎమ్మెల్యే నివాసంలో కడ్తాల్ మండల పరిధిలోని గనుగుమర్ల తండా నూతన ఉప సర్పంచ్ గా ఎన్నికైన జర్పుల లక్పతి నాయక్, వార్డు సభ్యులు కవితగోపి నాయక్ ను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి శాలువాలతో సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ..గ్రామాల అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుంది,గ్రామాల అభివృద్ధికి నిరంతరం పాటుపడుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు శ్రీనివాస్ గౌడ్,డీసీసీ అధికార ప్రతినిధి బిఖ్య నాయక్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మునావత్ రాజు నాయక్,నేనావత్ రాజు నాయక్,హరిలాల్, నాయకులు, యువకులు, తదితరులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించిన అభ్యర్థులకు ట్రస్మా సన్మానం



**వనపర్తి,డిసెంబర్ 18(నీలగిరి ఎక్స్ ప్రెస్):** తెలంగాణ గ్రామపంచాయతీ ఎన్నికల్లో మణిగిల్ల గ్రామం నుంచి పలుస శ్రీనివాస్ గౌడ్, అన్నారం గ్రామం నుంచి ఎండి వహీద్ ఘన విజయం సాధించిన సందర్భంగా ట్రస్మా వనపర్తి ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్మా ప్రతినిధులు మాట్లాడుతూ, ప్రజల నమ్మకంతో ఎన్నికల్లో విజయం సాధించిన అభ్యర్థులు గ్రామాభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని ఆకాంక్షించారు. గ్రామాల్లో విద్య, మౌలిక సదుపాయాలు, పరిశుభ్రత, సంక్షేమ కార్యక్రమాల అమలులో సర్పంచుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో వనపర్తి జిల్లా వ్యాప్తంగా ఉన్న పలు ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సభ్యులు పాల్గొని, విజేతలను అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. గ్రామాల సమగ్ర అభివృద్ధికి తమవంతు సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ట్రస్మా అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు



## సంకటోని పల్లి గ్రామంలో అయ్యప్ప స్వాములు ఇరుముడి కార్యక్రమంలో పాల్గొన్న పాపిశెట్టి రాము

## బీసీల ఐక్యతే రాజ్యాధికారానికి మార్గం



**పెద్దపల్లి, డిసెంబర్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా మూడు విడతల్లో జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో బీసీలు తమ సత్తాను బలంగా చాటారని, అనేక గ్రామాల్లో సర్పంచ్ స్థానాలను గెలుచుకుని ఘన విజయాన్ని సాధించారని బీసీ సంక్షేమ సంఘం పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కందుల సదాశివ్ తెలిపారు.స్థానిక ఎన్నికల్లో బీసీలు ప్రదర్శించిన ఈ ఐక్యతను రాజకీయ అధికార సాధన వైపు మళ్లించాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్ర జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలకు సామాజిక న్యాయం సక్రమంగా జరగాలంటే 42 శాతం రిజర్వేషన్లు తప్పనిసరని, ప్రస్తుతం తగ్గిన రిజర్వేషన్లను పునరుద్ధరించేందుకు బీసీలు పార్టీలకు అతీతంగా ఒకే తాటిపైకి రావాలని సూచించారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై గట్టి ఒత్తిడి పెంచేలా ఐక్యమత్యంతో పోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన స్పష్టం చేశారు. స్థానిక సంస్థల్లో సత్తా చాటినట్లే రాబోయే ఎన్నికల్లోనూ బీసీలు మరింత చైతన్యంతో రాణించాలని కోరారు. తమ హక్కులు, రాజ్యాధికారాన్ని సాధించే వరకు నిరంతర పోరాటం కొనసాగించాలని, అప్పుడే బీసీల ఆకాంక్షలు నెరవేరుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.రాష్ట్రవ్యాప్తంగా గ్రామపంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించిన బీసీలకు కందుల సదాశివ్ శుభాకాంక్షలు తెలిపారు.

## బిజెపి అభ్యర్థుల ఘన సన్మానం



**పెద్దపల్లి, డిసెంబర్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నిమ్మనపల్లి సర్పంచ్‌గా వేల్పుల రమేష్, బొంపల్లి సర్పంచ్‌గా దాడి మౌనిక సంతోష్ విజయం సాధించిన సందర్భంగా బిజెపి నాయకులు వారిని ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్, టిఆర్ఎస్ ఎన్ని కుట్రలు చేసినా ప్రజలు ధర్మం వైపు నిలబడి బిజెపి అభ్యర్థులను గెలిపించారని, గ్రామాల ప్రజలకు, శ్రేయోభిలాషులకు, గెలుపుకోసం కష్టపడ్డ ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. రాబోయే ఎంపీటీసీ, జెడ్పిటిసి, మున్సిపల్ ఎన్నికల్లో కూడా అధిక సంఖ్యలో సీట్లు కైవసం చేసుకుంటామని విశ్వాసం వ్యక్తం చేశారు.కార్యక్రమంలో సోమారపు లావణ్య, పట్టణ అధ్యక్షుడు పెంజర్ల రాకేష్, తంగడ రాజేశ్వర రావు, పోల్సాని సంపత్ రావు, మేకల శ్రీనివాస్, వొళ్లే తిరుపతి, ఎర్రోళ్ల శ్రీకాంత్, గుడ్ల సతీష్, బోలావేన సురేందర్, ముంజ రాజేంద్రప్రసాద్, గాదసి సతీష్, సిలారపు మహేష్, ఆనందరావు, నవీన్, సతీష్, కుక్క అంజి, అనాసి వంశీ, అనుదీప్ తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ కార్డు లబ్ధిదారులకు కలెక్టర్ సూచనలు



**పెద్దపల్లి, డిసెంబర్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష రేషన్ కార్డు లబ్ధిదారులు తప్పనిసరిగా ఈ కేవైసి పూర్తి చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ప్రతి కార్డుదారు వేలిముద్ర సహాయంతో 100% ఈ కేవైసి పూర్తి చేయాలని, ఇప్పటివరకు జిల్లాలో 76.29% మాత్రమే పూర్తయిందని తెలిపారు.మిగిలిన 1,68,272 మంది లబ్ధిదారులు, ఐదు సంవత్సరాల వయస్సు పైబడిన వారు తమ నివాస సమీపంలోని రేషన్ షాపుకు వెళ్లి ఈ కేవైసి పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు ఈ కేవైసి నుండి మినహాయింపు ఇచ్చినట్లు తెలిపారు. ఎఫ్ పీ షాపు డీలర్లు తమ షాపులను తెరిచి లబ్ధిదారులకు సహకరించాలని, రేషన్ షాపుల వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు.

# ఎన్టీఆర్ అభిమానికి నందమూరి కుటుంబం అశ్రునివాళి



**తిరుపతి, డిసెంబర్ 18(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
తిరుపతిలో గురువారం నాడు నందమూరి తారకరామారావు వీరాభిమాని ఎన్టీఆర్ రాజు పార్థివ దేహానికి నందమూరి కుటుంబం తరపున నందమూరి రామకృష్ణ, నందమూరి మోహనకృష్ణ నివాళులు అర్పించారు. ఎన్టీఆర్ రాజు అకాల మరణం తెలుగు దేశం పార్టీకి, నందమూరి కుటుంబానికి తీరని లోటని వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎన్టీఆర్ రాజు నందమూరి వీరాభిమానిగా ఎనలేని సేవలందించారని, రెండు సార్లు టీటీడీ బోర్డు సభ్యుడిగా ఎన్నికై భక్తులకు విస్తృత సేవలు అందించారని గుర్తు చేశారు. టీటీడీ అభివృద్ధికి ఆయన అనేక సూచనలు ఇచ్చినట్లు పేర్కొన్నారు.ఎన్టీఆర్ రాజు మృతి యావత్ నందమూరి అభిమానులకు తీరని లోటని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించాలని భగవంతుడ్ని ప్రార్థించారు.

## పార్లమెంట్ కార్యాలయం వద్ద ఉద్రిక్తత



**కరీంనగర్, డిసెంబర్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ పార్లమెంట్ కార్యాలయం వద్ద గురువారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కాంగ్రెస్ శ్రేణులు కార్యాలయాన్ని ముట్టడించేందుకు ప్రయత్నించగా, బిజెపి కార్యకర్తలు అడ్డుకోవడంతో ఇరు పార్టీల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. హోరాహోరీగా నినాదాలు వినిపించాయి. తరువాత బిజెపి శ్రేణులు జిల్లా కాంగ్రెస్ కార్యాలయాన్ని ముట్టడించేందుకు బయలుదేరగా, పోలీసులు అడ్డుకున్నారు. పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి ఇరు పార్టీల నేతలను పోలీసులు అరెస్టు చేశారు.ఈ సందర్భంగా బిజెపి నేతలు యాదగిరి సునీల్ రావు, బోయిన్‌పల్లి ప్రవీణ్ రావు, వాసాల రమేష్ కాంగ్రెస్ వ్యవహరించిన తీరుపై మండిపడ్డారు. నేషనల్ హెరాల్డ్ కేసు 2008లో ప్రారంభమైందని, ఆ సమయంలో మోడీ ప్రభుత్వం లేకపోవడం వల్ల బిజెపిపై ప్రతీకార రాజకీయాల ఆరోపణలు చేయడం తగదని పేర్కొన్నారు.కాంగ్రెస్ ఈ కేసును రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవడం మూర?త్వమని, డూప్లికేట్ గాంధీ వారసులకు మద్దతు ఇస్తున్న నాయకులు సిగ్గుపడాలని వ్యాఖ్యానించారు. బిజెపితో ఇలాంటి రాజకీయ ఆటలాడితే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.

## పంచాయతీ ఎన్నికల్లో బీజేపీ సెంచరీ



**కరీంనగర్, డిసెంబర్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బీజేపీ కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో వందకు పైగా సర్పంచ్ స్థానాలను గెలుచుకుని చరిత్ర సృష్టించింది. తొలి రెండు దశల్లో 76 స్థానాలు, మూడో విడతలో మరో 24 స్థానాలు సాధించి మొత్తం 100 పైగా విజయాలు నమోదు చేసింది. గత ఎన్నికల్లో కేవలం 22 స్థానాలు గెలిచిన బీజేపీ ఈసారి అనూహ్యంగా పెరుగుదల సాధించింది. హుజూరాబాద్ నియోజకవర్గంలోని రాంపూర్, శాలపల్లి, సైదాబాద్, తనుగుల, మల్లన్నపల్లి, చిన్న పాపయ్యపల్లి గ్రామాల్లో గెలిచిన అభ్యర్థులు కూడా బీజేపీలో చేరుతుండడంతో సంఖ్య మరింత పెరిగింది. విజేతలకు కేంద్ర మంత్రి బండి సంజయ్ శుభాకాంక్షలు తెలుపుతూ, బీజేపీలో చేరుతున్న స్వతంత్ర అభ్యర్థులను స్వాగతించారు. ఆయా గ్రామాల అభివృద్ధికి కేంద్ర నిధులు, ఎంపీ లాడ్స్, సీఎస్సార్ నిధులను వినియోగిస్తానని ప్రకటించారు.

## మంత్రి పొన్నం ప్రభాకర్ సుడిగాలి పర్యటన



**హుస్నాబాద్, డిసెంబర్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
:హుస్నాబాద్ పట్టణంలో మంత్రి పొన్నం ప్రభాకర్ సుడిగాలి పర్యటన చేపట్టి మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి బైక్‌పై పర్యటిస్తూ అంబేద్కర్ భవన్, సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులను సమీక్షించారు. ఇప్పటికే శంకుస్థాపన చేసిన రోడ్లు, డ్రైనేజీలు, కమ్యూనిటీ హాల్లు, జంక్షన్‌ల అభివృద్ధి పనులను పరిశీలించి మున్సిపల్ కమిషనర్, అధికారులకు పెండింగ్ పనులను వేగవంతం చేయాలని సూచించారు. పట్టణంలో ఇంకా అవసరమైన రోడ్లు, డ్రైనేజీ పనులపై ఆరా తీశారు.స్థానిక ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్న మంత్రి, ఎల్లమ్మ చెరువు సుందరీకరణ, జంక్షన్‌ల అభివృద్ధి పనులపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. హుస్నాబాద్ మున్సిపాలిటీ రాష్ట్రంలో ఆదర్శంగా నిలిచేలా అన్ని రంగాల్లో అభివృద్ధి కార్యాచరణ కొనసాగుతుందని ఆయన తెలిపారు.

## పుష్కర ఏర్పాట్లపై కలెక్టర్ దృష్టి



**మంచిర్యాల, డిసెంబర్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
2027లో గోదావరి, 2028లో కృష్ణా పుష్కరాలను పురస్కరించుకొని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమర్థవంతమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో రాష్ట్ర దేవాదాయ శాఖ, ఎర్నెస్ట్ & యంగ్ సంస్థ ప్రతినిధులతో సమావేశమై ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పుష్కరాల నిర్వహణను సురక్షితంగా, సవ్యంగా, భక్తులకు అనుకూలంగా చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టిందని తెలిపారు.పుష్కరాల ప్రణాళిక, సమన్వయం, అమలు బాధ్యతలను ఎర్నెస్ట్ & యంగ్ సంస్థకు అప్పగించారని, దేవాదాయ శాఖకు అవసరమైన వివరాలు అందజేస్తామని చెప్పారు. జిల్లాలోని 11 పుష్కర ఘాట్లను సందర్శన సంఖ్య ఆధారంగా మూడు టియర్స్‌గా విభజించి అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు.స్నానఘాట్ల అభివృద్ధి, ఆలయాల పునరుద్ధరణ, రహదారులు, త్రాగునీరు, పారిశుధ్యం, విద్యుత్, ఆరోగ్యం, భద్రత వంటి మౌలిక సదుపాయాల కల్పనలో సంబంధిత శాఖలు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా దేవాదాయ శాఖ అధికారి నవీన్ కుమార్, రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

## శాతవాహన విశ్వవిద్యాలయంలో కొత్త నియామకాలు




**కరీంనగర్, డిసెంబర్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
శాతవాహన విశ్వవిద్యాలయంలో బాలుర వసతిగృహ వార్డెన్‌గా బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం అధ్యాపకుడు డా. ఎం. మనోజ్ కుమార్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ & యూత్ వెల్ఫేర్ ఆఫీసర్‌గా డా. కృష్ణకుమార్ నియమితులయ్యారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఉమేశ్ కుమార్ ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ఆచార్య జాస్తి రవి కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. చీఫ్ వార్డెన్ ఆఫీస్, స్పోర్ట్స్ బోర్డు ఆఫీస్‌లలో డాక్టర్ నజీముద్దీన్ మున్వర్‌కు జాయినింగ్ రిపోర్ట్ అందజేశారు. స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ, చీఫ్ వార్డెన్ మాట్లాడుతూ కొత్తగా బాధ్యతలు స్వీకరించిన అధికారులు విశ్వవిద్యాలయ అభివృద్ధి దిశగా సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా డా. మనోజ్ కుమార్, డా. కృష్ణకుమార్ తమపై పెట్టిన నమ్మకానికి ఉపకులపతి, రిజిస్ట్రార్, ఓ.ఎస్.డి కి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు డా. రాజు, విశ్వవిద్యాలయ పిడి విజయ్ కుమార్, వార్డెన్స్ డా. ఎస్. కిరణ్, సావిత్రి, జయంతి, వసతిగృహ సంరక్షకురాలు సంధ్య, ప్రవీణ్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నిరసన ర్యాలీ




**హనుమకొండ, డిసెంబర్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నేషనల్ హెరాల్డ్ కేసు నేపథ్యంలో హనుమకొండ జిల్లాకాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి నాయకత్వంలో అంబేద్కర్ కూడలి వద్ద నిరసన ర్యాలీ జరిగింది. బీజేపీ రాజకీయ కక్షతో ఏఐసీసీ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీపై ఈడీ ద్వారా వేధింపులు జరుగుతున్నాయని, ఢిల్లీ కోర్టు ఈడీ చర్యలను తప్పుబట్టిన విషయాన్ని ప్రజలకు వివరించేందుకు ఈ ర్యాలీ చేపట్టినట్లు నాయకులు తెలిపారు. అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రారంభమైన ర్యాలీలో పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కేంద్ర ప్రభుత్వ దమనకాండకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రతిపక్ష గొంతులను అణిచేందుకు బీజేపీ దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తోందని వారు విమర్శించారు. ర్యాలీ సందర్భంగా పోలీసులు జోక్యం చేసుకుని పలువురు నేతలు, కార్యకర్తలను అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఈ.వి. శ్రీనివాస్ రావు, అజీజ్, తోట వెంకటేశ్వర్లు, జక్కుల రవీందర్, విజయ శ్రీ రాజాలీ, మామిండ్ల రాజు, దేవరకొండ విజయలక్ష్మి సురేందర్, బంక సంపత్, అంకుష్, బంక సరళ, పెరుమాండ్ల రామకృష్ణ, పులి అనిల్, విక్రమ్, గుంటి స్వప్న, సమత, నసీం జా, మాజీ కార్పొరేటర్లు, మహిళా నాయకులు, డివిజన్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## సముద్రాల గ్రామ ఉప సర్పంచ్‌గా చింతకింది సింగర్ విజయం




**హుస్నాబాద్, డిసెంబర్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కోహెడ మండలం సముద్రాల గ్రామంలో జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో 12వ వార్డు నుండి పోటీ చేసిన చింతకింది సింగర్ ఘన విజయం సాధించారు. గతంలో మూడు సార్లు వార్డు సభ్యుడిగా, కోహెడ సింగిల్ విండో డైరెక్టర్‌గా, 2018లో హుస్నాబాద్ శాసనసభ్యుడిగా పోటీ చేసిన ఆయన ప్రజలతో అనుబంధాన్ని కొనసాగిస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వీరభద్రస్వామి ఆలయ కమిటీ సభ్యుడిగా మూడు సంవత్సరాలు, విద్యా కమిటీ చైర్మన్‌గా ఆరు సంవత్సరాలు పనిచేసిన ఆయనకు తాజా ఎన్నికల్లో 91 ఓట్లు లభించగా, సమీప ప్రత్యర్థి 53 ఓట్లు, మరో అభ్యర్థి 43 ఓట్లు పొందారు. 38 ఓట్ల మెజార్టీతో గెలుపొందిన ఆయన గ్రామాభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని విలేకరుల సమావేశంలో తెలిపారు.

# కాంగ్రెస్ నిరసన ర్యాలీ






**కరీంనగర్, డిసెంబర్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నేషనల్ హెరాల్డ్ కేసు నేపథ్యంలో ఏఐసీసీ, టీపీసీసీ పిలుపు మేరకు కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ జరిగింది. అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రారంభమైన ర్యాలీ చైతన్యపురి కాలనీ లోని ఎంపీ క్యాంపు కార్యాలయానికి చేరుకునే ప్రయత్నంలో పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. రోడ్డుపై బైఠాయింపు చేపట్టిన కాంగ్రెస్ శ్రేణులను పోలీసులు అరెస్టు చేసి పిటిసి కి తరలించారు. కార్పొరేషన్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు అంజన్ కుమార్ మాట్లాడుతూ, ప్రతిపక్షాలను భయపెట్టే ప్రయత్నం చేస్తున్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలను కోర్టు కొట్టివేసిందని, నేషనల్ హెరాల్డ్ పత్రిక స్వాతంత్ర ఉద్యమానికి ప్రతీక అని గుర్తుచేశారు. బిజెపి ప్రభుత్వం తప్పుడు ఆరోపణలు మానుకోవాలని హెచ్చరించారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, కేసులో ఎలాంటి అక్రమాలు లేవని కోర్టు తేల్చిందని, సోనియా గాంధీ, రాహుల్ గాంధీపై ఈడీ విచారణలు జరిపినందుకు బిజెపి ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో సిరాజు హుస్సేన్, బానోతు శ్రావణ్ నాయక్, అరుణ్ కుమార్, మల్లికార్జున రాజేందర్, ఆకారపు భాస్కర్ రెడ్డి, కర్ర రాజశేఖర్, కల్వల రామచందర్, లింగంపల్లి బాబు, బోనాల శ్రీనివాస్, అబ్దుల్ రహమాన్, మూల రవీందర్ రెడ్డి, చర్ల పద్మ, అహమ్మద్ అలీ, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, ఇమ్రాన్, వీర దేవేందర్, కామ్రెడ్డి రాంరెడ్డి, సలీముద్దీన్, పడిశెట్టి భూమయ్య, కాశెట్టి శ్రీనివాస్, కోటగిరి భూమా గౌడ్, పొన్నం మధు, మునిగంటి అనిల్, గంట కళ్యాణి, హసీనా, మీసా రమాదేవి, స్వప్న శ్రీ తదితరులు పాల్గొన్నారు.

# ఆశా వర్కర్ల ఆందోళన



**కరీంనగర్, డిసెంబర్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జిల్లాలో ఆశా వర్కర్లు లెప్రసీ సర్వేకు సంబంధించిన పెండింగ్ బిల్లులు చెల్లించేవరకు ఎల్‌సీడీసీ సర్వే చేయబోమని స్పష్టం చేశారు. ఈ మేరకు సీఐటీయూ నాయకులు డీఎంహెచ్ఓ డా. వెంకట రమణకు వినతి పత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎడ్ల రమేష్, ప్రధాన కార్యదర్శి మారెళ్ళ శ్రీలత మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా డిసెంబర్ 18 నుండి లెప్రసీ సర్వే చేయాలని ఆరోగ్యశాఖ అధికారులు ఆశాలను ఆదేశించినప్పటికీ, అదనపు పారితోషికంపై స్పష్టత ఇవ్వకపోవడం వల్ల ఆశా వర్కర్లు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. గతంలో కూడా పెండింగ్ బిల్లులు చెల్లించేందుకు పెద్ద పోరాటం చేయాల్సి వచ్చిందని, ఇప్పుడు మళ్లీ అదే సమస్యలు సృష్టించడం అన్యాయమని పేర్కొన్నారు. ఆశా వర్కర్లకు కనీస వేతనం ఇప్పటికీ లభించడం లేదని, రూ.18,000 స్థిర వేతనం నిర్ణయించి వారిని ఆదుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని వారు అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎలక్షన్ డ్యూటీలు చేసిన ఆశాలకు కూడా ఇప్పటివరకు చెల్లింపులు జరగలేదని, 2022-23 లెప్రసీ సర్వే బిల్లులు, పల్స్ పోలియో బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు కాల్వ సారిక, ప్రధాన కార్యదర్శి మారెళ్ళ శ్రీలత, ఉపాధ్యక్షులు నాగెల్లి పద్మ, సత్యలక్ష్మి, సహాయ కార్యదర్శి సరిత, సుమలత, నాయకులు ప్రియంక, సదాలక్ష్మి, రమాదేవి, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ ఎన్నికల విజయవంతమైన పూర్తి



**కరీంనగర్, డిసెంబర్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మూడు దశల్లో పంచాయతీ ఎన్నికల ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసిన మొదటి జిల్లాగా కరీంనగర్ నిలిచింది. ఈ విషయాన్ని రాష్ట్ర ఎన్నికల సంఘం సోషల్ మీడియా వేదికగా ప్రకటిస్తూ, జిల్లా కలెక్టర్‌తో పాటు ఎన్నికల యంత్రాంగాన్ని అభినందించింది. జిల్లాలో డిసెంబర్ 11, 14, 17 తేదీల్లో మూడు విడతల్లో పోలింగ్ జరిగింది. మొదటి విడతలో గంగాధర, చొప్పదండి, రామడుగు, కరీంనగర్ రూరల్, కొత్తపల్లి మండలాల్లో 81.42 శాతం పోలింగ్ నమోదైంది. రెండో విడతలో చిగురుమామిడి, గన్నేరువరం, శంకరపట్నం, తిమ్మాపూర్, మానకొండూర్ మండలాల్లో 86.58 శాతం పోలింగ్ జరిగింది. మూడో విడతలో హుజురాబాద్, జమ్మికుంట, ఇల్లందకుంట, వీణవంక, వి. సైదాపూర్ మండలాల్లో 86.42 శాతం పోలింగ్ నమోదైంది. ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించడంలో సహకరించిన అధికారులు, పోలింగ్ సిబ్బందిని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అభినందించారు. సాధారణ పరిశీలకుడు వెంకటేశ్వర్లు, జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్వర్ కృషిని ప్రత్యేకంగా ప్రశంసించారు

## మేరా యువభారత్

### కరీంనగర్ జిల్లాలో యువజన సంఘాలకు క్రీడా సామాగ్రి

**కరీంనగర్, డిసెంబర్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను మేరా యువభారత్ ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని యువజన సంఘాల నుండి క్రీడా సామాగ్రి కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ ప్రకటించింది. దరఖాస్తు చేసుకునే సంఘాలు తప్పనిసరిగా రిజిస్టర్డ్ అయి ఉండాలి. సభ్యుల వయస్సు 18 నుండి 29 సంవత్సరాల మధ్య ఉండాలి. దరఖాస్తుతో పాటు సంఘం రిజిస్ట్రేషన్ కాపీ, బైలాస్, గత ఐదు సంవత్సరాల కార్యక్రమాలకు సంబంధించిన పత్రికా ప్రకటనలు, ఫోటోలు జత చేయాలి. దరఖాస్తు ప్రొఫార్మా మేరా యువభారత్ కరీంనగర్ జిల్లా కార్యాలయం (బస్టాండ్ ఎదురుగా) అందుబాటులో ఉంటుంది. ఈ సంవత్సరం మొత్తం 120 సంఘాలకు క్రీడా సామాగ్రి అందజేయబడుతుంది. అందులో కరీంనగర్ జిల్లాకు 30, పెద్దపల్లి జిల్లాకు 30, జగిత్యాల జిల్లాకు 30, రాజన్న సిరిసిల్ల జిల్లాకు 30 కేటాయించారు. ఆసక్తి కలిగిన యువజన సంఘాలు డిసెంబర్ 31, 2025 సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తులు సమర్పించాలి.

ఎం. వెంకట్ రాంబాబు
డిస్ట్రిక్ట్ యూత్ ఆఫీసర్, మేరా యువభారత్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా
మొబైల్ నం:9177329258

## స్వతంత్రభ్యర్థిగా పోటీ చేసి 10వ వార్డులో 27 ఓట్ల మెజార్టీతో గెలుపు



**దేవరకొండ డిసెంబర్ 18. (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
నల్లగొండ జిల్లా డిండి మండలం గోనబోయినపల్లి గ్రామానికి చెందిన పాలె రాజుకి పార్టీలు టికెట్ ఇవ్వకుండా మోసం చేసిన గాని ప్రజల పట్ల ఉన్న విశ్వాసంతో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి అధికార ప్రతిపక్ష పార్టీలకు ముచ్చెమటలు పట్టించి 27 ఓట్ల మెజారిటీతో పదో వార్డు స్వతంత్రం అభ్యర్థిగా గెలుపొందారు. నా మీద నమ్మకం వుంచి ఓటు వేసి గెలిపించిన నా వార్డు ప్రజలకు మరియు గ్రామ ప్రజలకు ఈ సందర్భంగా నా ప్రత్యేక కృతజ్ఞతలు అని తెలియజేశారు.

# పన్నెండు వేల మంది విద్యార్థులకు ఉచిత దంత పరీక్షలు

**కరీంనగర్, డిసెంబర్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, కస్తూరిబా గాంధీ విద్యాలయాలు, మోడల్ స్కూళ్లు, జిల్లా పరిషత్ పాఠశాలల్లో చదువుతున్న సుమారు 12 వేల మంది విద్యార్థులకు ఉచిత దంత వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. అవసరమైన వారికి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చికిత్స అందించనున్నట్లు చెప్పారు. శాతవాహన యూనివర్సిటీ సమీపంలోని ప్రభుత్వ బధిరుల ఆశ్రమ పాఠశాలలో జరుగుతున్న దంత వైద్య శిబిరాన్ని కలెక్టర్ సందర్శించి, విద్యార్థులకు నిర్వహించిన పరీక్షలు, చికిత్స వివరాలను వైద్యుల నుండి తెలుసుకున్నారు. జిల్లావ్యాప్తంగా విద్యార్థులు, మున్సిపల్ కార్మికులు, మల్టీపర్పస్ వర్కర్లకు దంత పరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్స అందించాలని నిర్ణయించామని కలెక్టర్ తెలిపారు. ఇప్పటివరకు 9 వేల మంది విద్యార్థులకు పరీక్షలు పూర్తయ్యాయని, 24 మందికి చికిత్స అవసరమని గుర్తించి ఆసుపత్రిలో ఉచితంగా వైద్యం అందించామని చెప్పారు. కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో దంత చికిత్సకు కావలసిన అన్ని సౌకర్యాలు, వైద్య బృందం సిద్ధంగా ఉన్నాయని, మరిన్ని సౌకర్యాలు కూడా కల్పిస్తున్నామని కలెక్టర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి సూపరింటెండెంట్ వీరారెడ్డి, ఆర్ఎంవో నవీన, డెంటల్ నిపుణులు రవి ప్రవీణ్, రణధీర్, సాహిత్య, ప్రిన్సిపల్ కమల పాల్గొన్నారు.




# జాతీయ రహదారి పనులపై సమీక్ష



**హుస్నాబాద్, డిసెంబర్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

హుస్నాబాద్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ జాతీయ హైవేస్ అథారిటీ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎల్కతుర్తి–హుస్నాబాద్–సిద్దిపేట మార్గంలో జరుగుతున్న జాతీయ రహదారి పనుల పురోగతిని ఆయన ఆరా తీశారు. పనులు ఆలస్యం కావడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేసిన మంత్రి, రహదారి పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. హుస్నాబాద్–సిద్దిపేట మార్గంలో పెండింగ్‌లో ఉన్న బ్రిడ్జిలు, కల్వర్టులను తక్షణమే పూర్తి చేయాలని సూచించారు.

# జగిత్యాలలో బీజేపీ విమర్శలు

**జగిత్యాల, డిసెంబర్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

కాంగ్రెస్ పార్టీ ప్రజాదరణ కోల్పోయిన తర్వాతే ఓటు చోరీ జరిగిందని అసత్య ప్రచారం చేస్తోందని, ఆ ప్రచారాన్ని ఇండికూటమి నేతలే విశ్వసించడం లేదని బీజేపీ జిల్లా ఇంచార్జి గడ్డం శ్రీనివాస్ అన్నారు. జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాహుల్ గాంధీ చేస్తున్న ప్రచారం అసత్యమని, ఎన్నికలు రాగానే కాంగ్రెస్ పార్టీకి ప్రజాస్వామ్యం, రాజ్యాంగం గుర్తుకొస్తుందని విమర్శించారు. స్వాతంత్రానంతరం నెహ్రూ కుటుంబమే అసలైన ఓటు చోరీకి పాల్పడిందని, సర్దార్ పటేల్‌కు అధిక ఓట్లు వచ్చినప్పటికీ నెహ్రూ ప్రధానమంత్రి అయిన ఉదాహరణను ప్రస్తావించారు. ఇందిరా గాంధీ, సోనియా గాంధీ, పీవీ నరసింహారావు కాలంలో కూడా కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్యాన్ని అవహేళన చేసిందని ఆరోపించారు. 2024లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో ఓటు చోరీ జరిగిందని కాంగ్రెస్ చేస్తున్న ప్రచారం నిజమైతే, కాంగ్రెస్ గెలిచిన నియోజకవర్గాలు కూడా చెల్లవని ఆయన వ్యాఖ్యానించారు. బీజేపీ ఓటు చోరీ చేస్తే వాజపేయి ఒక్క ఓటు తేడాతో ప్రధానమంత్రి పీఠాన్ని వదులుకునే వారు కాదని గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అక్రమ చొరబాటుదారులకు ఓటు హక్కు కల్పించి ఓటు బ్యాంకుగా మార్చుకుందని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులకు గ్యారంటీ, వారంటీ అయిపోయిందని, అందుకే మతిభ్రమించి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు రాచకొండ యాదగిరి బాబు, ప్రధాన కార్యదర్శులు నలువాల తిరుపతి, వడ్డేపల్లి శ్రీనివాస్, పిల్లి శ్రీనివాస్, కార్యదర్శి జుంబర్తి దివాకర్, సాంబార్ కళావతి, బెజ్జారపు లవన్, కస్తూరి లక్ష్మీనారాయణ, కోశాధికారి సుంకెట దశరథ రెడ్డి, సోషల్ మీడియా ఇన్చార్జ్ సుంచు సురేష్, గుంటుక సదాశివ్, ధోనికెల నవీన్, బొడ్ల రమేష్, పంచరి విజయ్, మరిపెల్లి సత్యం, ముత్యం రెడ్డి, సిరికొండ రాజన్న, చిట్యాల రాము, భాస్కర్, మరిపెల్లి సాగర్, మంచే రాజేష్, దురిశెట్టి మమత, గడ్డల లక్ష్మి, మధుప్రియ, ముద్దం రాము, సోమలక్ష్మి, మౌనిక, ముద్దం గంగారెడ్డి, మామిడాల రాజగోపాల్, భుక్య తిరుపతి నాయక్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.




# ఇసుక లారీలపై పిడిఎస్యు ఆందోళన

**హుజురాబాద్, డిసెంబర్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

వీణవంక మండల పరిధిలోని చల్లూరు, మల్లారెడ్డిపల్లి, కొండపాక, మానేరు పరిసర గ్రామాల నుండి ఇసుకను తరలిస్తూ కోట్ల రూపాయలు దండుకుంటున్న కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని పిడిఎస్యు ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు అంగిడి కుమార్ డిమాండ్ చేశారు. ఇసుక లారీలకు నిబంధనలకు విరుద్ధంగా వెల్డింగ్ మరమ్మతులు చేసి ఇంజన్ సామర్థ్యానికి మించి ఇసుకను నింపుతూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని ఆయన ఆరోపించారు. మైనింగ్ అధికారులు, మోటార్ వెహికల్ చట్టం ప్రకారం ప్రతి లారీపై పర్యవేక్షణ చేసి, రిజిస్ట్రేషన్ రద్దు చేసి యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు. ఇసుక వ్యాపారాల వల్ల భూగర్భ జలాలు ఎండిపోతున్నాయని, గ్రామాలు తీవ్రమైన సమస్యలను ఎదుర్కొంటున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే ఇసుక లారీలను నిలిపివేయాలని, లేనిపక్షంలో గ్రామ ప్రజలు, యువతను చైతన్యం చేసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

# రాఘవపూర్ సర్పంచ్‌కు ఘన సన్మానం



**పెద్దపల్లి, డిసెంబర్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

పెద్దపల్లి మండలంలోని రాఘవపూర్ గ్రామానికి నూతనంగా ఎన్నికైన బీఆర్ఎస్ సర్పంచ్ తాడిచెట్టు చామంతి శ్రీకాంత్‌ను మాజీ శాసనసభ్యుడు దాసరి మనోహర్ రెడ్డి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆశయాలకు అనుగుణంగా గ్రామాభివృద్ధి కోసం అంకితభావంతో పని చేయాలని సూచించారు. రాఘవపూర్ గ్రామాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లడంలో బీఆర్ఎస్ నాయకత్వం కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మార్కు లక్ష్మణ్, విలేజ్ ప్రెసిడెంట్ కొమురయ్య, కుమారస్వామి, రామస్వామి, టిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# ప్రజల మనసు గెలిచిన నాయకుడు

**-మీర్జాపూర్ సర్పంచ్ వేల్పుల సంపత్ కుమార్**



**హుస్నాబాద్, డిసెంబర్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు అంకితభావంతో, నిరంతర పోరాటం ద్వారా ప్రజల విశ్వాసాన్ని గెలుచుకున్న నాయకుడిగా మీర్జాపూర్ గ్రామ సర్పంచ్ వేల్పుల సంపత్ కుమార్ ప్రత్యేక గుర్తింపు పొందారు. బాల్యం నుంచే కాంగ్రెస్ సిద్ధాంతాలను నమ్మి, పార్టీ కోసం తన జీవితాన్ని అంకితం చేసిన ఆయన, కష్టకాలాల్లోనూ పార్టీ జెండాను నిలబెట్టిన వ్యక్తిగా గ్రామ ప్రజల్లో విశ్వాసాన్ని సంపాదించారు. తెలంగాణ రాష్ట్ర అవతరణకు ముందు, ఆ తరువాత వరుసగా రెండు పర్యాయాలు తెరాస ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలోనూ మీర్జాపూర్‌లో కాంగ్రెస్ జెండాను నిలబెట్టిన ఏకైక నాయకుడిగా ఆయన నిలిచారు. అవకాశవాద రాజకీయాలకు దూరంగా, ఒకే పార్టీ –ఒకే సిద్ధాంతం – ఒకే నిబద్ధతతో ముందుకు సాగిన నాయకుడిగా ఆయనకు మంచి పేరు ఉంది. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం, హుస్నాబాద్ నియోజకవర్గానికి ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండే మంత్రి పొన్నం ప్రభాకర్ అండగా ఉండటంతో గ్రామాభివృద్ధికి మంచి అవకాశం లభించిందని సంపత్ కుమార్ తెలిపారు. తన పదవి లేదా స్వార్థం కోసం కాకుండా, గ్రామ భవిష్యత్తు, యువత అభివృద్ధి, వ్యవసాయం, తాగునీరు, రోడ్లు, విద్య, సంక్షేమం వంటి రంగాల్లో సమగ్ర అభివృద్ధే లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. తనపై నమ్మకం ఉంచి సర్పంచ్‌గా ఎన్నుకున్న గ్రామ ప్రజలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతూ, ప్రతి ఒక్కరి సహకారంతో మీర్జాపూర్‌ను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని ఆయన హామీ ఇచ్చారు.

# సర్పంచుల బాధ్యతల స్వీకరణ తేదీ మార్పు

**కరీంనగర్, డిసెంబర్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

నూతనంగా ఎన్నికైన గ్రామ సర్పంచులు బాధ్యతలు స్వీకరించే తేదీని ప్రభుత్వం ముందుగా ఈ నెల 20గా నిర్ణయించింది. అయితే ఆ రోజు ముహూర్తం అనుకూలంగా లేదని సూచించిన నమిలకొండ రమణాచార్యుల స్వామి సూచనల మేరకు తేదీని మార్చి ఈ నెల 22గా ఖరారు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం, ప్రజల సంక్షేమ దృష్ట్యా 22వ తేదీ సోమవారం ఉత్తరాషాఢ నక్షత్రంలో విదయతో కూడిన తదియ మంచి ముహూర్తం కావడంతో ఆ రోజున బాధ్యతల స్వీకరణ జరగనుందని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.



# సిరిసిల్లలో బీజేపీ స్పందన

**రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా బీజేపీ కార్యాలయాల ముందు ధర్నా చేయాలని పిలుపునిచ్చిందని, కానీ ఆ ధర్నా ఎందుకు చేస్తున్నారో వారికే తెలియదని జిల్లా బీజేపీ అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని పార్టీ కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడుతూ, నేషనల్ హెరాల్డ్ కేసు వ్యక్తిగతంగా సుబ్రహ్మణ్యస్వామి వేసినదని, దానికి బీజేపీకి సంబంధం లేదని స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఈడీ విచారణ చేపట్టిందని, విచారణకు నోటీసులు జారీ చేయడం సహజమని తెలిపారు. కేసులో నిర్దోషులుగా బయటపడితే సంబరాలు చేసుకోవాల్సింది పోయి ధర్నాలు చేయడం అర్థం కాని చర్య అని గోపి విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని, బీజేపీ నాయకులను కార్యాలయంలో బంధించడం, అరెస్టు చేయడం సమంజసం కాదని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు పొన్నాల తిరుపతిరెడ్డి, సిరికొండ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు శీలం రాజు, కోశాధికారి ఆసాని రామలింగారెడ్డి, మీడియా కన్వీనర్ కాసుగంటి రాజు రావు, మహిళా మోర్చా అధ్యక్షురాలు పల్లం అన్నపూర్ణ, పట్టణ అధ్యక్షుడు దుమాల శ్రీకాంత్, కొనరావుపేట మండలానికి చెందిన మిరాల్కర్ బాలాజీ, వేములవాడ పట్టణ అధ్యక్షుడు రాపల్లి శ్రీధర్, చందుర్తి మండల అధ్యక్షుడు మోకిలే విజయేందర్, మహిళా నాయకురాలు వైశాలి, జిల్లా మరియు రాష్ట్ర పదాధికారులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 40 ఓట్లు ఉన్న ఓసీ అభ్యర్థి ఎలా గెలుస్తాడన్న వాళ్లకు షాక్

**బుసిరెడ్డిపల్లి ప్రజల తీర్పుతో ప్రభాకర్ రెడ్డి ఘన విజయం**



**వనపర్తి,డిసెంబర్ 18( నీలగిరి ఎక్స్ ప్రెస్ ):** వనపర్తి జిల్లా పాన్గల్ మండలం బుసిరెడ్డిపల్లి గ్రామపంచాయతీ ఎన్నికలు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. మొత్తం 10 వార్డులు ఉన్న ఈ గ్రామంలో అన్ని వార్డులకు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నిక కాగా, సర్పంచ్ పదవికి మాత్రం పోటీ నెలకొంది. ఈ ఎన్నికల్లో ఓసీ అభ్యర్థికి కేవలం 40 ఓట్లు మాత్రమే ఉంటాయని, ఆయన ఎలా గెలుస్తాడని కొందరు చేసిన వ్యాఖ్యలు వైరల్ అయ్యాయి.పోటీలో ఉన్న బీసీ అభ్యర్థి మీడియా ముందు “నన్ను మోటివేట్ చేసి లాక్కోవాలని చూశారు, అయినా నేను గెలుస్తాను” అంటూ ధీమా వ్యక్తం చేయడం అప్పట్లో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అయితే ప్రజాస్వామ్యబద్ధంగా గ్రామ ప్రజలు ఇచ్చిన తీర్పు అన్ని అంచనాలను తలకిందులు చేసింది. తలకంటి ప్రభాకర్ రెడ్డిని ప్రజలు భారీ మెజార్టీతో గెలిపించి, 740 ఓట్ల ఆధిక్యంతో సర్పంచ్‌గా ఎన్నుకున్నారు.ఈ విజయం తనపై గ్రామ ప్రజలకు ఉన్న ప్రేమ, నమ్మకం, గ్రామంతో తనకు ఉన్న అనుబంధమే కారణమని ప్రభాకర్ రెడ్డి తెలిపారు. ప్రజలు ఎంతో ఆత్మీయంగా తనను ఆదరించి గెలిపించారని అన్నారు.ఈ సందర్భంగా పీఎన్‌ఆర్ విద్యాసంస్థల చైర్మన్ నారాయణరెడ్డి గురువారం సాయంత్రం ప్రభాకర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ప్రజల తీర్పు ప్రజాస్వామ్యానికి అద్దం పడుతుందని, ఈ విజయం గ్రామ రాజకీయాల్లో కొత్త అధ్యాయంగా నిలుస్తుందని ఈ కార్యక్రమంలో పాల్గొన్న వనపర్తి కాంటెస్ట్ ఎమ్మెల్యే అభ్యర్థి గంగవరం రామకృష్ణారెడ్డి అభిప్రాయపడ్డారు.

## జాతీయ లోక్ అదాలత్ ను విజయవంతం చేయాలి : జిల్లా ప్రధాన న్యాయమూర్తి



**మహబూబాబాద్, డిసెంబర్ 18(నీలగిరి ఎక్స్ ప్రెస్)** మహబూబాబాద్ జిల్లా కోర్టు ప్రాంగణంలో గురువారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎండి అబ్దుల్ రఫీ పోలీస్ శాఖ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు.ఈ నెల 21 న జరగబోయే జాతీయ లోక్ అదాలత్ లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా పోలీస్ శాఖ కృషి చేయాలన్నారు. లోక్ అదాలత్‌లో కేసులు ఎక్కువగా పరిష్కారమవడం వలన బాధితులకు త్వరితగతిన న్యాయం లభిస్తుందని వివరించారు.ఈ కార్యక్రమం లో సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి షాలిని షాకెల్లి,అబ్కారీ శాఖ సూపర్డెంట్ ఆఫ్ పోలీస్ టి కిరణ్, జూనియర్ సివిల్ జడ్జి లు, స్వాతి మురారి, ధీరజ్ కుమార్ దామెర, అదనపు జూనియర్ సివిల్ జడ్జి అర్వపల్లి కృష్ణ తేజ్, డీస్పీలు తిరుపతి రావు, కృష్ణ కిషోర్, జిల్లా పరిధిలోని అన్నీ స్టేషన్ ల సీఐ లు, ఎస్సై లు, జిల్లా కోర్టు పరిపాలనాధికారి మంత్రి ప్రగడ క్రాంతి కుమార్ పాల్గొన్నారు.

## మహబూబాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ రాస్తారోకో




**మహబూబాబాద్, డిసెంబర్ 18(నీలగిరి ఎక్స్ ప్రెస్)** మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయం ఎదుట ప్రధాన రహదారిపై గురువారం కాంగ్రెస్ పార్టీ శ్రేణులు రాస్తారోకో చేపట్టారు. నేషనల్ హెరాల్డ్ పత్రిక వ్యవహారంలో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలపై బీజేపీ ప్రభుత్వం వేధింపులు చేస్తున్నదని నిరసిస్తూ ఈ కార్యక్రమం జరిగింది.ఎమ్మెల్యే డాక్టర్ మురళీ నాయక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ రాస్తారోకోలో కాంగ్రెస్ కార్యకర్తలు ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షా లకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నేషనల్ హెరాల్డ్ కేసు విషయంలో బీజేపీ ప్రభుత్వం రాజకీయ కక్షతో వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ అగ్ర నాయకత్వంపై దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తూ ప్రతీకార చర్యలకు పాల్పడడం దుర్మార్గమని పేర్కొన్నారు. సోనియా, రాహుల్‌లపై కేసులు పెట్టినా భయపడేది లేదని, కేసులను ఎత్తివేసే వరకు ఉద్యమం కొనసాగుతుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నల్గొండ జిల్లాలో సమర్థవంతంగా స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ



**నల్గొండ, డిసెంబర్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** నల్గొండ జిల్లాలో స్థానిక సంస్థల సాధారణ ఎన్నికలు-2 ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా పూర్తయ్యాయని బంజారా ఉద్యోగుల సంఘం తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ మాలోతు దశరథ్ నాయక్ తెలిపారు.గురువారం మిర్యాలగూడలో జరిగిన కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ అమిత్ నారాయణను, స్టేజ్-1, స్టేజ్-2 అధికారులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నడూ లేని విధంగా అదనపు కలెక్టర్ అమిత్ నారాయణ సారథ్యంలో ఎన్నికలు సజావుగా, ఎటువంటి లోటుపాట్లు లేకుండా, ఘర్షణలు లేకుండా విజయవంతంగా నిర్వహించామని పేర్కొన్నారు. అన్ని ఏర్పాట్లు చేసిన సబ్ కలెక్టర్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.అదేవిధంగా డివిజన్ పరిధిలో పనిచేసిన రిటర్నింగ్ అధికారులకు ఎన్నికల నిబంధన ప్రకారం రూ.8,000 నుండి రూ.10,000 వరకు రెమ్యూనరేషన్ చెల్లించేలా తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక సంస్థల కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు.కార్యక్రమంలో గోపి నాయక్, సైదా నాయక్, శ్రీనివాస్ రావు, సైదులు నాయక్, నాయుడు, సీనయ్య, సత్యనారాయణ, వెంకన్న, వెంకట్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## వటవర్లపల్లి నూతన సర్పంచ్, వార్డు సభ్యులకు ఘన సన్మానం



అమ్రాబాద్, డిసెంబర్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : అమ్రాబాద్ మండల పరిధిలోని వటవర్లపల్లి గ్రామపంచాయతీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ ఘన విజయం సాధించిన సందర్భంగా, గ్రామ ఉపసర్పంచ్‌గా ఎన్నికైన బండ బాలరాజు, నలుగురు వార్డు సభ్యులను భాజపా రాష్ట్ర నాయకులు, అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజ్ శాలువాలతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా గువ్వల బాలరాజ్ మాట్లాడుతూ, వటవర్లపల్లి గ్రామ బీజేపీ నాయకులు, కార్యకర్తలకు భవిష్యత్తుపై స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. భారతీయ జనతా పార్టీ అంటేనే యువ నాయకత్వం, ప్రజాసేవకు అంకితభావం అని పేర్కొంటూ, రానున్న రోజుల్లో గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయాలని కార్యకర్తలను ప్రోత్సహించారు.కార్యక్రమంలో బీజేపీ నాగర్‌కర్నూల్ జిల్లా ఉపాధ్యక్షులు గంగిశెట్టి నాగరాజు, కర్నాటి శ్రీనివాస్, బోడ శంకర్, నాగిళ్ల శంకర్, రంగశివ, రవి, సురేష్, సురేందర్, వికాస్, మహేష్‌తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.అదేవిధంగా గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీని బలోపేతం చేసే దిశగా భారతీయ జనతా పార్టీ నిరంతరం ప్రజల పక్షాన పోరాటం చేస్తుందని గువ్వల బాలరాజ్ స్పష్టం చేశారు.

## విషాద కుటుంబాలకు భరోసా

**- మృతుల కుటుంబాలను పరామర్శించిన నిజామాబాద్ ఎమ్మెల్యే**






**నిజామాబాద్, డిసెంబర్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** భారతీయ జనతా పార్టీ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి చిన్ననాన్నతో పాటు నడిపల్లి గ్రామ సర్పంచ్ సతీష్ కులాచారి తండ్రి ఇటీవల మృతి చెందగా, ఈ విషాద వార్తను తెలుసుకున్న నిజామాబాద్ అర్బన్ శాసనసభ్యులు ధన్‌పాల్ సూర్యనారాయణ వారి నివాసాలకు వెళ్లి మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ సందర్భంగా మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించిన ఎమ్మెల్యే, కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ దుఃఖాన్ని భరించే శక్తిని భగవంతుడు ప్రసాదించాలని ప్రార్థిస్తూ తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కష్టకాలంలో పార్టీ తరపున పూర్తిగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగోల్లా లక్ష్మీనారాయణ, మఠం పవన్, ముండాడ పవన్, మాజీ కార్పొరేటర్ ప్రభాకర్‌తో పాటు స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


## బెల్లంపల్లిలో నూతన సర్పంచ్‌లకు ఘన సన్మానం



**బెల్లంపల్లి, డిసెంబర్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజల విశ్వాసంతో గెలుపొందిన బెల్లంపల్లి నియోజకవర్గంలోని ఏడు మండలాల నూతన సర్పంచ్‌లకు ఘన సన్మాన కార్యక్రమం బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి క్యాంపు కార్యాలయంలో జరిగింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వినోద్ వెంకటస్వామి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్యానికి, గ్రామ స్వయంపాలనకు ఎప్పుడూ పెద్దపీట వేస్తుందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో గ్రామపంచాయతీల బలోపేతానికి చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్రామపంచాయతీలే రాష్ట్ర అభివృద్ధికి పునాది అని, ప్రజలు ఇచ్చిన బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తిస్తూ ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని సర్పంచ్‌లకు సూచించారు.తాగునీరు, పారిశుధ్యం, రోడ్లు, విద్యుత్, విద్య, ఆరోగ్యం వంటి మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించి గ్రామాల్లో సర్వతోముఖాభివృద్ధి సాధించాల్సిన బాధ్యత సర్పంచ్‌లదేనని ఆయన పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలతో గ్రామీణ ప్రజల జీవన ప్రమాణం మెరుగుపడుతుందని అన్నారు.పార్టీ, ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తేనే గ్రామాల అభివృద్ధి వేగవంతం అవుతుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పిన్నింటి రఘునాథ్ రెడ్డి, మండల అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కుష్టు వ్యాధి నివారణకు ఇంటింటి సర్వే

**-మహబూబాబాద్ జిల్లా వైద్యాధికారి**



**మహబూబాబాద్, డిసెంబర్ 18 (నీలగిరి ఎక్స్ ప్రెస్)** కుష్టు వ్యాధి గ్రస్తులను ముందుగానే గుర్తించి సమయానికి చికిత్స అందించడం ద్వారా అంగవైకల్యాన్ని నివారించవచ్చునని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రవి రాథోడ్ తెలిపారు.జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించిన ఆయన మాట్లాడుతూ, డిసెంబర్ 18 నుండి 31 వరకు కుష్టు వ్యాధి కేసుల గుర్తింపు కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. ఈ సందర్భంగా ఆశా కార్యకర్తలు ఇంటింటి సర్వే నిర్వహించినప్పుడు ఏ వ్యక్తి శరీరంపై మచ్చలు గాని, రాగి వర్ణం కలిగిన మచ్చలు గాని కనిపిస్తే, అట్టి వ్యక్తులను సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పంపించి వైద్యాధికారుల ద్వారా నిర్ధారణ చేయాలని సూచించారు.ఒకవేళ కేసు గుర్తిస్తే, పూర్తి కాలం చికిత్స తీసుకునేలా ఆశా కార్యకర్తలు వారిని ప్రోత్సహించాలని ఆయన పేర్కొన్నారు. గృహ సందర్శనలో కుటుంబంలోని ప్రతి సభ్యుని క్షుణ్ణంగా పరిశీలించాలని, కుష్టు వ్యాధి వంశపారంపర్యంగా వచ్చే వ్యాధి కాదని, ప్రభుత్వ ఆసుపత్రులలో ఉచితంగా చికిత్స అందుబాటులో ఉంటుందని డాక్టర్ రాథోడ్ స్పష్టం చేశారు.






# అల్లు అర్జున్ సిస్టర్‌గా మృణాల్ ఠాకూర్?

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, స్టార్ దర్శకుడు అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కబోయే భారీ చిత్రంపై బన్నీ ఫ్యాన్స్‌తో పాటు సినీ ఇండస్ట్రీలోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ ప్రాజెక్ట్ అనౌన్స్‌మెంట్ వచ్చినప్పటి నుంచే అధికారిక అప్‌డేట్స్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో తాజాగా ఈ సినిమాకు సంబంధించిన మరో క్రేజీ టాక్ సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. ఈ మూవీలో బాలీవుడ్ నటి మృణాల్ ఠాకూర్ కీలక పాత్రలో కనిపించనున్నట్టు ఇప్పటికే వార్తలు వచ్చాయి. అయితే తాజాగా వినిపిస్తున్న సమాచారం ప్రకారం, మృణాల్ ఠాకూర్ ఈ సినిమాలో అల్లు అర్జున్‌కు సిస్టర్ రోల్‌లో నటించబోతున్నారట. ఈ పాత్ర కథలో చాలా కీలకమైనదిగా, బలమైన ఎమోషనల్ టోన్‌తో సాగుతుందని టాక్. అన్న-చె÷-లలెల మధ్య బంధం, భావోద్వేగాలను అట్లీ తన మార్క్ స్టైల్‌లో చూపించబోతున్నాడని, ఈ పాత్ర ప్రేక్షకులను బాగా కనెక్ట్ చేస్తుందని అంటున్నారు. అయితే ఇది అధికారికంగా ధృవీకరించాల్సి ఉంది. నిజంగా మృణాల్ సిస్టర్ రోల్‌లో కనిపిస్తారా? లేక మరో షేడ్స్ ఉన్న క్యారెక్టర్‌లో వస్తారా? అన్నది వేచి చూడాల్సిందే.ఇక ఈ సినిమాకు సంబంధించిన మరో హైలైట్ ఏమిటంటే.. బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పడుకోణె ఇందులో మెయిన్ హీరోయిన్‌గా నటించనుండగా, జాన్వీ కపూర్ మరో కీలక హీరోయిన్ పాత్రలో కనిపించనుంది. ఒకే సినిమాలో ఇంతమంది స్టార్ హీరోయిన్లు ఉండటం వల్ల ఈ ప్రాజెక్ట్‌పై మరింత క్రేజ్ పెరుగుతోంది.కథ విషయానికి వస్తే.. మాఫియా బ్యాక్‌డ్రాప్‌లో ఓ డాన్ చుట్టూ తిరిగే పవర్‌ఫుల్ కథను అట్లీ సిద్ధం చేశాడట. యాక్షన్, ఎమోషన్, డ్రామా అన్నీ సమపాళ్లలో ఉండేలా స్క్రిప్ట్‌ను రూపొందించినట్టు సమాచారం. అల్లు అర్జున్‌ను ఇప్పటివరకు ఎప్పుడూ చూడని విధంగా, ఒక కొత్త షేడ్స్ ఉన్న పాత్రలో చూపించేందుకు అట్లీ ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్టు తెలుస్తోంది. ఈ భారీ ప్రాజెక్ట్‌ను సన్ పిక్చర్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. ప్రొడక్షన్ వ్యాల్యూస్ విషయంలో ఏ మాత్రం రాజీ పడకుండా, హాలీవుడ్ రేంజ్‌లో సినిమాను తెరకెక్కించేందుకు ఎ÷-లాన్ చేస్తున్నారట. అంతేకాదు, ఈ సినిమాలో కొన్ని ప్రత్యేక గెస్ట్ రోల్స్ కూడా ఉండబోతున్నాయని టాక్. వాటి కోసం అట్లీ పలువురు స్టార్ నటులను సంప్రదించనున్నారని సమాచారం. ఆ గెస్ట్ రోల్స్‌లో ఎవరు కనిపిస్తారన్నది మరో ఆసక్తికర అంశంగా మారింది.

# కార్తీక్ ఆర్యన్, అనన్య పాండే 'తూ మేరీ మై తేరా' ట్రైలర్ విడుదల!

బాలీవుడ్ యువ నటీనటులు కార్తీక్ ఆర్యన్, అనన్య పాండే ప్రధాన పాత్రల్లో నటిస్తున్న రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ 'తూ మేరీ మై తేరా మై తేరా తూ మేరీ' . ఈ సినిమాకు సమీర్ విద్వాన్స్ దర్శకత్వం వహిస్తుండగా.. 'సత్యప్రేమ్ కి కథ' చిత్రం తర్వాత కార్తీక్ – సమీర్ కాంబోలో వస్తున్న రెండో చిత్రమిది. ప్రముఖ నిర్మాత కరణ్ జోహార్‌కి చెందిన ధర్మ ప్రొడక్షన్స్ , నమః పిక్చర్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ఈ చిత్రం క్రిస్మస్ కానుకగా డిసెంబర్ 25న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. ఈ ట్రైలర్ చూస్తుంటే.. కార్తీక్, అనన్యలు అనుకోకుండా ఒక విదేశీ హాలిడే ట్రిప్‌లో కలుసుకోగా.. గొడవలతో మొదలైన వీరి పరిచయం ప్రేమగా ఎలా మారింది అనేది సినిమా కథ అని తెలుస్తుంది. 'పతి పత్ని ఔర్ వోహ్' తర్వాత కార్తీక్ ఆర్యన్, అనన్య పాండే కలిసి నటిస్తున్న రెండవ చిత్రం ఇది. దీంతో ఈ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి.



## చాలా ప్రమాదకరమైంది..
# విలన్ పాత్రపై కాంతార బ్యూటీ రుక్మిణి వసంత్

రిషబ్ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన పాన్ ఇండియా ప్రాజెక్ట్ కాంతార చాప్టర్ 1 (ప్రీక్వెల్). 2025లో అత్యధిక గ్రాస్ సాధించిన భారతీయ సినిమాగా నిలిచింది. గ్లోబల్ బాక్సాఫీస్ వద్ద రూ.800 కోట్లు లైఫ్ టైం వసూళ్లు రాబట్టి.. సెకండ్ హయ్యెస్ట్ గ్రాస్ సాధించిన కన్నడ సినిమాగా అరుదైన ఫీట్ నమోదు చేసింది.కాగా ప్రీక్వెల్‌లో ఎవరూ ఊహించని విధంగా రుక్మిణి వసంత్ విలన్ రోల్‌లో కనిపిస్తుంది. చాలా మంది ఈ రోల్ చూసి షాకయ్యారు. అయితే విలన్ పాత్ర గురించి తాజా ఇంటర్వ్యూలో ఆసక్తికర విషయం షేర్ చేసింది రుక్మిణి వసంత్ .నా కెరీర్ తొలినాళ్లలోనే కాంతార చాప్టర్ 1లో నేను విలన్ పాత్రలో నటించడం చాలా ప్రమాదకర ప్రయోగం. దీంతో ఇక నేను జీవితంలో మిగిలిన టైం అంతా విలన్ పాత్రల్లో నటిస్తానేమోనని ఆశ్చర్యపోయా. నేను నెగెటివ్ రోల్ పోషించడాన్ని జనాలు ప్రేమించారు.. వాళ్లు నన్ను అసహ్యించుకోలేదు. అందువల్లే సినిమా ఎలా ఆడుతుందో ఆలోచిస్తూ నేను భయపడాల్సిన అవసరం లేదంది. ఇలా జరుగుతుందని ఎవరూ ఊహించలేదు అది గొప్ప విషయమంటూ చెప్పుకొచ్చింది రుక్మిణి వసంత్. ఇప్పుడీ కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి.రుక్మిణి వసంత్ బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో బిజీగా ఉంది. వీటిలో రెండు భారీ బడ్జెట్ సినిమాలే కావడం విశేషం. వీటిలో ఒకటి కేజీఎఫ్ స్టార్ యశ్ నటిస్తోన్న టాక్సిక్ కాగా.. మరొకటి ప్రశాంత్ నీల్ డైరెక్షన్‌లో గ్లోబల్ స్టార్ ఎన్టీఆర్ నటిస్తోన్న డ్రాగన్. ఈ రెండు సినిమాలు పాన్ ఇండియా ఇమేజ్ ఉన్న స్టార్ హీరో సినిమాలే కావడంతో అంచనాలు భారీగా నెలకొన్నాయి.

# అసభ్య కంటెంట్‌ను ప్రోత్సహించవద్దు



కృత్రిమ మేధని (ఏఐ) ఉపయోగించి సృష్టిస్తున్న అభ్యంతరకరమైన కంటెంట్ పట్ల కథానాయిక శ్రీలీల ఆవేదన వ్యక్తం చేసింది. అలాంటి కంటెంట్, వీడియోలను ప్రోత్సహించవద్దని సోషల్‌మీడియా యూజర్లను కోరింది. ఈ సందర్భంగా బుధవారం ఆమె సోషల్‌మీడియా ఖాతాలో ఓ ఎమోషనల్ పోస్ట్ పెట్టింది. 'ఏఐ కంటెంట్‌ను అస్సలు ప్రోత్సహించవద్దని సోషల్‌మీడియా వినియోగదారులందరినీ చేతులు జోడించి వేడుకుంటున్నా. సాంకేతికత మన జీవితాలను సరళం చేయాలి. అది మంచి కోసం ఉపయోగపడాలి. కానీ ఇలా ఇతరుల జీవితాలను ఇబ్బందుల్లో నెట్టకూడదు.కళాత్మక రంగంలో ఉన్న ప్రతీ అమ్మాయి ఒకరికి కూతురు, సోదరి, మనవరాలు, సహోద్యోగి అయి ఉంటుందనే విషయాన్ని గుర్తుపెట్టుకోవాలి. ఆమె కళను వృత్తిగా స్వీకరించి ఉండవచ్చు. ఇండస్ట్రీలో భాగమైనందుకు ఆమెకు రక్షణతో కూడిన వాతావరణం ఉందనే నమ్మకాన్ని కలిగించాలి. నాకున్న బిజీ షెడ్యూల్స్ కారణంగా ఆన్‌లైన్‌లో ఏం జరుగుతుందో పట్టించుకోవడం లేదు. కానీ కొందరు మిత్రులు ఈ అంశాలను నా దృష్టికి తీసుకొచ్చారు. నా సహ నటీనటులు కూడా ఇలాంటి పరిస్థితిని ఎదుర్కోవడం బాధగా ఉంది. ప్రేక్షకులపై మాకు ఎంతో నమ్మకం. అందుకే వారిని మాకు అండగా నిలబడమని అభ్యర్థిస్తున్నా. సంబంధిత అధికారులు ఏఐ అసభ్య కంటెంట్‌పై చర్యలు తీసుకుంటారని కోరుకుంటున్నా' అని శ్రీలీల తన పోస్ట్‌లో పేర్కొన్నది.

# కన్నెపిట్టరో కన్నుకొట్టరో'.. అదిరిపోయిన అడివి శేష్ 'డెకాయిట్' టీజర్




టాలీవుడ్ నటుడు అడివి శేష్ , మృణాల్ ఠాకూర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'డెకాయిట్' . ఒక ప్రేమ కథ అనేది ఉపశీర్షిక. ఈ ప్రాజెక్ట్ ద్వారా షానీల్ డియో అనే కొత్త దర్శకుడు ఇండస్ట్రీకి పరిచయం కానున్నాడు. ఇప్పటికే ఈ సినిమా నుంచి ఫస్ట్‌గ్లింప్స్‌ను విడుదల చేయగా మంచి రెస్పాన్స్ దక్కించుకుంది. ఇదిలావుంటే.. తాజాగా ఈ సినిమా నుంచి చిత్రబృందం సినిమా టీజర్‌ను విడుదల చేసింది. నాగార్జున సినిమాలోని ఐకానిక్ సాంగ్ 'కన్నెపిట్టరో కన్నుకొట్టరో' బ్యాక్‌గ్రౌండ్ పాటతో ఈ టీజర్ మొదలవ్వగా.. ఫుల్ యాక్షన్ డ్రామాగా ఈ టీజర్ సాగింది. ఇందులో అడివిశేష్, మృణాల్ ఠాకూర్ దొంగలుగా నటించబోతున్నట్లు తెలుస్తుంది. ఈ భారీ బడ్జెట్ పాన్ ఇండియా చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌పై సుప్రియ యార్లగడ్డ నిర్మిస్తుంది. బాలీవుడ్ దర్శకుడు అనురాగ్ కశ్యప్ ఈ చిత్రంలో కీలక పాత్రలో నటిస్తుండగా.. మార్చి 19న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతుంది.